Bhavani Publication Trust https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక

రిపోర్టర్లు కావలెను

అధునాతన సాంకేతికతతో.. ఎప్పటి వార్తలు అప్పుడు అందించేందేందుకు మీ ముందుకు వచ్చిన

ప్రజా టెలివిజన్

యూట్యూబ్ చానల్‌లో పని చేయుటకు రిపోర్టర్లు కావలెను. ఎలాంటి టార్గెట్లు ఉండవు. నిత్యనూతనంగా వార్తలు, లైవ్‌లు అందించడమే మీ పని..

సంప్రదించండి: 8309979541, 9494659622

PRAJA TELEVISION The People's Favour

మా యూట్యూబ్ చానల్‌ను సపోర్ట్ చేయండి 8309979541

ప్రజా టెలివిజన్ తాజా వార్తలు, అప్‌డేట్, లైవ్ ప్రోగ్రామ్‌ల కోసం లైక్, షేర్, సబ్‌స్క్రైబ్

సంపుటి : 26 | సంచిక : 181 | హైదరాబాద్ | సోమవారం 25 మే 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR



# వామ్మో వడదెబ్బ

## రాష్ట్రంలో ఒక్కరోజే 42 మంది మృతి

- ఒక్క ఉమ్మడి వరంగల్‌లోనే ఆదివారం17 మంది మరణం
- ఉమ్మడి ఖమ్మంలో 10 మంది.. కరీంనగర్‌లో 8 మంది మృతి
- నల్లగొండ జిల్లాలో ఐదుగురి కన్నుమూత
- మూడు రోజుల్లో 100 మంది పైనే మృత్యువాత
- పగలంతా ఎండ, వడగాలులు.. సాయంత్రం గాలివాన బీభత్సం
- ఆదివారం పలు జిల్లాల్లో వర్షాలకు తడిసిన ధాన్యం, మక్కలు
- హైదరాబాద్ సహా అనేక ప్రాంతాల్లో 43 డిగ్రీలకు పైగానే..

మే 24 (ప్రజాతీర్పు)

రాష్ట్రంలో భానుడి భగభగలతో ప్రజలు అల్లాడుతున్నారు. ఎండవేడిమికి తాళలేక పిట్టల్లా రాలిపోతున్నారు. రోజూ పదుల సంఖ్యలో వడదెబ్బ మరణాలు నమోదవుతున్నాయి. గతకొద్ది రోజులుగా రాష్ట్రంలో రోజూ వడదెబ్బతో 30-40 మంది వరకు మరణిస్తున్నారు. ఆదివారం కూడా రాష్ట్రవ్యాప్తంగా 42 మంది వడదెబ్బతో మరణించారు.



మరోవైపు వర్షాలు, పిడుగు పాట్లు కూడా ప్రాణాలు తీస్తున్నాయి. పగలంతా తీవ్రమైన ఎండలు, సాయంత్రం కాగానే విపరీతమైన గాలివాన భీభత్సం సృష్టిస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో ఉదయం 8-9 గంటల నుంచే మాడు పగిలే వేడి కనిపిస్తోంది. ఆదివారం రాష్ట్రంలో అనేకచోట్ల 43 నుంచి 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాయంత్రం కురిసిన వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లోని మక్కలు, వడ్లు తడిసిపోయాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా నిప్పుల కొలిమిలా మారింది. జిల్లాలో ఆదివారం ఒక్కరోజే వడదెబ్బతో 17 మంది

- మిగతా 2వ పేజీలో



## రైతుల సమస్యలపై భాజపా పోరు

### నేడు కనకచర్ల నుంచి భరోసా యాత్ర: ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, (ప్రజాతీర్పు) మే 24

రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి సకాలంలో ధాన్యం కొనకపోవడంతో కర్షకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నుంచి 'రైతు గోస.. భాజపా భరోసా' యాత్రను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పాల్వాయి హరీశ్‌బాబు, రామారావు పటేల్, ఎమ్మెల్సీ మల్క కొమరయ్య, భాజపా కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వ లక్ష్మీనర్సయ్య తదితరులతో కలిసి మహేశ్వర్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "భాజపా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావుతో కలిసి సోమవారం ఉదయం పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి రైతు యాత్రకు బయలుదేరుతాం. చేవెళ్ల

- మిగతా 2వ పేజీలో



## ఒప్పందానికి చేరువలో..

- అమెరికా- ఇరాన్ ఒప్పందం ఖరారు!
- అమెరికా షరతులకు ఇరాన్ అంగీకారం
- యురేనియం వదిలించుకోవడానికి సిద్ధం
- హోర్ముజ్ తెరవడానికి గ్రీన్‌సిగ్నల్
- సమయం అనుకూలంగా ఉంది
- ఒప్పందానికి తొందరొద్దని చెప్పా
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడి

వాషింగ్టన్/కైరో/న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో కల్లోలానికి తెరదించి.. శాంతి, స్థిరత్వం నెలకొల్పడానికి అడుగులు ముందుకు పడుతున్నాయి. యుద్ధాన్ని ముగించి, హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరిచి, శుద్ధిచేసిన యురేనియం నిల్వలను ఇరాన్ వదులుకునేలా చేసే ఒప్పందానికి అమెరికా చాలా చేరువలోకి వచ్చేసిందని అధికార వర్గాలు స్పష్టంచేశాయి. అమెరికా, ఇరాన్ మధ్య శాంతి

- మిగతా 2వ పేజీలో




> ఉచిత విద్యుత్తు రద్దులో భాగంగా వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, నాడు రూ.30 వేల కోట్ల రుణాన్ని రాష్ట్రానికి ఇవ్వకుండా ఆపినా సరే భారాస అధినేత కేసీఆర్ కేంద్రం ఒత్తిడికి తలొగ్గకుండా ఉచిత విద్యుత్తును కొనసాగించారని కేటీఆర్ గుర్తుచేశారు.

# ఉచిత విద్యుత్తు రద్దుకే మీటర్లు

## కేసుల భయంతో మోదీకి తలొగ్గిన సీఎం రేవంత్‌రెడ్డి .. కేటీఆర్ ఆరోపణ

అంబర్‌పేట, (ప్రజాతీర్పు) మే 24

ఉచిత విద్యుత్తు రద్దులో భాగంగా వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. అదానీ, అంబానీలకు చెందిన ప్రైవేట్ సంస్థలు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను రాష్ట్రవ్యాప్తంగా అమర్చనున్నాయని, బిల్లులు చెల్లించకుంటే విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. కేసుల భయంతోనే ప్రధాని మోదీ ఒత్తిడికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తలొగ్గి రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ప్రీపెయిడ్ మీటర్లు పెట్టాలని నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. ఆదివారం ఛేనంబర్ చౌరస్తాలోని ఓ ఫంక్షన్ హాలులో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారాస అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గ బూత్ స్థాయి ముఖ్య నేతలు, కార్యకర్తల సమావేశానికి హాజరై ఆయన మాట్లాడారు. నాడు రూ.30 వేల కోట్ల రుణాన్ని రాష్ట్రానికి ఇవ్వకుండా ఆపినా సరే భారాస అధినేత కేసీఆర్ కేంద్రం ఒత్తిడికి తలొగ్గకుండా ఉచిత విద్యుత్తును కొనసాగించారని గుర్తుచేశారు.

"నగర అభివృద్ధిని పట్టించుకోకుండా లండన్, న్యూయార్క్ తరహాలో ఫ్యూచర్ సిటీ చేస్తామంటున్న రేవంత్‌రెడ్డి మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరు. రూ.1,100 కోట్లతో కొండపోచమ్మ నుంచి గండిపేటకు కాలువ అనుసంధానం, రూ.4 వేల కోట్లతో మూసీనది మురుగునీటి శుద్ధికి 32 ఎస్టీపీలు, రూ.545 కోట్లతో మూసీ నదిపై 15 పైవంతెనల నిర్మాణం ఇలా అనేక అభివృద్ధి పనులను కేసీఆర్ హయాంలో చేపట్టారు. అప్పటి అభివృద్ధి పనులను ఇప్పుడు ప్రారంభించడం తప్ప సీఎం చేసిందేమీ లేదు.

### మూసీ ప్రక్షాళన పేరుతో కూల్చివేతలు

భారాస పదేళ్ల పాలనలో రెండు పడక గదుల ఇళ్లు లక్ష నిర్మిస్తే.. ఈ రెండున్నరేళ్లల్లో ఒక్క ఇంటినీ కట్టకపోగా రూ.1.50 లక్షల కోట్లతో మూసీ ప్రక్షాళన, చెరువుల పునరుద్ధరణ అంటూ హైడ్రా పేరుతో బుల్‌డోజర్లను పంపి వేలాది పేదల ఇళ్లను కూలగొట్టారు. భారీ వ్యయంతో పనిలేకుండా కేవలం రూ.16 వేల కోట్లతో ఎవరికీ నష్టం కలగకుండా మూసీనదికి ఇరువైపులా రేవంత్‌రెడ్డి రోడ్లను నిర్మించాలి. ఓటమి భయంతోనే భాజపా ఓట్ల తొలగించేందుకు సిద్ధమైంది. భారాస బూత్ స్థాయి ఏజెంట్లు

- మిగతా 2వ పేజీలో



## ధాన్యం కొనుగోళ్లపై మంత్రివర్గంలో చర్చించకపోవడం సరికాదు: జీవన్‌రెడ్డి

హైదరాబాద్: ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతుంటే శనివారం నిర్వహించిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో దానిపై చర్చించకపోవడం సరికాదని భారాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.జీవన్‌రెడ్డి

- మిగతా 2వ పేజీలో



## నౌకాయాన వాణిజ్యానికి ప్రాధాన్యం

- అంతరాయం లేని రవాణా వ్యవస్థను కోరుకుంటున్నాం
- 'మేక్ ఇన్ ఇండియా'కు కట్టుబడి
- ఇతర దేశాలతో భాగస్వామ్యం
- భారత విదేశాంగశాఖ మంత్రి జైశంకర్
- అమెరికా విదేశాంగ మంత్రి రుబియోతో భేటీ

న్యూఢిల్లీ, మే 24: అంతరాయాలు లేని నౌకాయాన వాణిజ్యానికి భారత్ ప్రాధాన్యమిస్తుందని భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ స్పష్టం చేశారు. 'మేక్ ఇన్ ఇండియా'ను బలోపేతం చేసేలా గ్లోబల్ భాగస్వామ్య విధానాన్ని అవలంబిస్తామని వెల్లడించారు. ఆదివారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్ వేదికగా అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రుబియోతో ఆయన భేటీ అయ్యారు. ఇద్దరూ కొన్ని గంటలపాటు ఇరు

- మిగతా 2వ పేజీలో



## యాదగిరీశుడి సన్నిధికి పోటెత్తిన భక్తులు

### 70వేల మందికి పైగా భక్తుల సందర్శన

### ఆదివారం ఒక్కరోజే రూ.78,73,479 ఆదాయం

యాదాద్రి, మే 24 (ప్రజాతీర్పు):

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేసవి, వారాంతపు సెలవుల కారణంగా 70 వేలమందికిపైగా భక్తులు స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. కొండకింద ఘాట్‌రోడ్డు ప్రవేశం నుంచి కొండపై ఆలయ మాడ వీధులు, అంతరప్రాకార

- మిగతా 2వ పేజీలో



## తాలు, తరుగు పేరుతో కోతలు వేస్తే కఠిన చర్యలు

### గన్నీ బ్యాగులకు ఇబ్బంది లేదు.. ఇప్పటికే 51 ఎల్ఎంటీ ధాన్యం కొనుగోలు

### జిల్లా కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, మే 24 (ప్రజాతీర్పు): తాలు, తరుగు పేరుతో రైతులకు నష్టం కలిగేలా వ్యవహరిస్తే మిల్లర్లు, కొనుగోలు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై ఆదివారం హైదరాబాద్‌లోని పౌర సరఫరాల శాఖ కార్యాలయం నుంచి జిల్లాల కలెక్టర్లు, అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ చీఫ్‌విప్ ఆది శ్రీనివాస్, పౌర

- మిగతా 2వ పేజీలో

# ఉచిత విద్యుత్తు రద్దుకే మీటర్లు

(మొదటి పేజీ తరువాయి)

క్షేత్ర స్థాయిలో క్రియాశీలకంగా ఉండాలి.

**డిసెంబరు-జనవరిలో జీహెచ్ఎంసీ ఎన్నికలు**

భారాస డిజిటల్ సభ్యత్వ నమోదు అనంతరం ప్రతి నియోజకవర్గం నుంచి 1,000-1,200 మంది కార్యకర్తలకు శిక్షణ ఉంటుంది. డిసెంబరు-జనవరిలో జీహెచ్ఎంసీ ఎన్నికలు ఉంటాయి. పనితీరు సర్వే ఆధారంగా టికెట్లు ఇస్తాం. పైరవీలు, సిఫార్సులకు చోటు లేదు" అని కేటీఆర్ స్పష్టం చేశారు. మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్ సభ్యత్వ నమోదు ఇన్‌ఛార్జి కోలేటి దామోదర్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# వామ్మో వడదెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

మరణించారు. వరంగల్ నగరంలోని ఉర్సు, కరీమాబాద్, ఎస్ఆర్ఆర్‌తోట ప్రాంతాలకు చెందిన ఆవునూరి రాజు (46), బేతి అశోక్ (55), చింతనూరి సరోజ(70), మైదం శ్రీను (55) వడదెబ్బతో మరణించినట్లు వారి కుటుంబసభ్యులు తెలిపారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రానికి చెందిన వీరగాని వీరమ్మ (84), కొత్త రామయ్య (86), తొర్రూరు మండలం అమ్మాపురం గ్రామానికి చెందిన అత్తిలి రాము (60), టీక్యాతండాకు చెందిన జాటోత్ బీమోజీ (85), నాంచారిమదూరుకు చెందిన సోమ నారాయణ (65), కేసముద్రం స్టేషన్ బడితండాకు చెందిన అజ్మీరాలచ్యా (72), గూడూరు మండల కేంద్రంలోని చిట్యాల గడ్డకు చెందిన పాపాని ఎల్లమ్మ (68), తొర్రూరు పట్టణానికి చెందిన పైండ్ల నర్సయ్య (43), జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన తేలు పెద్ది మల్లవ్వ (70), వర్ధన్నపేటకు చెందిన చందు ఐలయ్య(88) వడ దెబ్బతో చనిపోయారు.

# ధాన్యం కొనుగోళ్లపై మంత్రివర్గంలో చర్చించకపోవడం సరికాదు: జీవన్‌రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు చేయండని రైతులు ప్రాధేయపడుతున్నా.. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు సమీక్ష కూడా నిర్వహించలేదని విమర్శించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన మాట్లాడారు. "వరి ధాన్యం 50 శాతం కల్లాలోనే ఉంది. అకాల వర్షాలకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మొక్కజొన్న కొనుగోలులోనూ పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళిక లేదు. ధాన్యం కొనుగోలుపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టత లేకుండా మాట్లాడుతున్నారు. జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు హైదరాబాద్‌కే పరిమితమయ్యారు. ఈ నెల 31వ తేదీలోపు ధాన్యం మొత్తం ప్రభుత్వం కొనుగోలు చేయకుంటే.. జూన్ 2న జెండా ఆవిష్కరణ చేసే నైతికత రేవంత్‌రెడ్డికి లేదు" అని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు.

# యాదగిరీశుడి సన్నిధికి పోటెత్తిన భక్తులు

(మొదటి పేజీ తరువాయి)

మండపాలు, ప్రసాదాల కౌంటర్లు భక్తులతో కిటకిటలాడాయి. ధర్మదర్శన క్యూలైన్లలో భక్తులు 4 గంటలపాటు నిరీక్షించారు. ఆదివారం ఒక్కరోజే రూ.78,73,479 ఆదాయం సమకూరింది. మరోవైపు కొండపైన ఎండతీవ్రతకు భక్తులు ఇబ్బందులు పడ్డారు. బండలు కాలుతుండటంతో అట్టలపై నిల్చుని ఫొటోలు తీసుకున్నారు. ఉక్కపోత కారణంగా వృద్ధులు, పిల్లలు అవస్థలు పడ్డారు. కొండపై తాగునీటిని అందించే జలప్రసాదం పైపుల్లో వేడినీరు రావడంతో భక్తులు తాగలేకపోయారు. మట్టికుండలతో చల్లని నీటిని అందించినా రద్దీ కారణంగా ఇబ్బందులు పడ్డారు.


# రైతుల సమస్యలపై భాజపా పోరు

(మొదటి పేజీ తరువాయి)

లోక్‌సభ నియోజకవర్గంలోని కనకచర్ల నుంచి యాత్ర మొదలవుతుంది. రాష్ట్రవ్యాప్తంగా కనీసం 30 శాతం కూడా కొనుగోళ్లు పూర్తికాలేదు. సీఎం 80 శాతం పూర్తిచేశామని చెప్పారు. ఏ లెక్క ప్రకారం చెప్పారో ఆయన జవాబు చెప్పాలి. శనగలు, పొద్దుతిరుగుడు వంటి పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదు. ధాన్యాన్ని దళారులే మూడొంతులు రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. మరో వారం రోజుల్లో వర్షాలొస్తాయి. దీంతో రైతులు బాధపడుతూ దళారులకు అమ్ముకుంటున్నారు. కొనుగోలు కేంద్రాల్లో 40 కేజీల బస్తాకు 4 కిలోలు అధికంగా తూకం వేస్తున్నారు. ఇక మక్కలు, జొన్నలు కూడా అరకొరగానే కొనుగోలు చేశారు. అన్నదాతల సమస్యలపై ప్రశ్నించేందుకే భాజపా రైతు భరోసా యాత్ర చేపట్టింది. యాత్రలో భాగంగా సోమవారం సాయంత్రానికి గజ్వేల్ చేరుకుంటాం. రాత్రి అక్కడే బస చేసి మర్నాడు భువనగిరి, జనగామ మీదుగా వరంగల్ చేరుకుంటాం. మూడో రోజు పెద్దపల్లికి చేరుకునేలా షెడ్యూల్ ఖరారైంది. మేం యాత్ర ప్రారంభిస్తున్నామని తెలిసి ఆదివారం ఉదయం గజ్వేల్‌కు కలెక్టర్ వెళ్లి లారీల లోడింగ్ వేగవంతం అయ్యేందుకు ప్రయత్నించడం సంతోషం. రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్లు ఇదేవిధంగా కల్లాలకు వెళ్లి కొనుగోలు చేయాలి" అని మహేశ్వర్‌రెడ్డి అన్నారు.

# తాలు, తరుగు పేరుతో కోతలు వేస్తే కఠిన చర్యలు

(మొదటి పేజీ తరువాయి)



సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావుతోపాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ కొనుగోలు చేసిన ధాన్యానికి ఇప్పటివరకు రూ.8,749 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 21 కోట్ల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయని, కొరత ఉందన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని మంత్రి పేర్కొన్నారు. రబీ సీజన్‌లో రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చినట్టు మంత్రి వెల్లడించారు. తాజా అంచనాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉండగా, ఇప్పటికే 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ నుంచి కేవలం 52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్నే కొనుగోలు చేస్తోందని, మిగిలిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు.

# ఏడాదిలోపు మోదీ సర్కార్ పతనం!

## విధాన వైఫల్యం వల్లే ఆర్థిక సంక్షోభం.. నీట్ పరీక్ష లీకేజీపై మంత్రి రాజీనామా చేసేవరకు విశ్రమించం

- మైనారిటీల ముసుగులో కాదు.. ముస్లిం సమస్యలపై నేరుగా పోరాడండి
- కాంగ్రెస్ ఆధ్వర్యంలో జూన్ 6న మైనారిటీ, ఎస్సీల ఉమ్మడి సదస్సు
- భవిష్యత్‌లో హిందూ-ముస్లిం రాజకీయాలు ఉండవు
- అసమానతలే జాతీయ సమస్యగా మారతాయ్: కాంగ్రెస్ నేత రాహుల్
- బీజేపీ ఆగ్రహం.. విదేశీ శక్తులతో కలిసి కుట్ర చేస్తున్నారని ధ్వజం



న్యూఢిల్లీ, మే 24: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఇంకో ఏడాది కంటే మనుగడ సాగించజాలదని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ అన్నారు. దేశంలో ఆర్థిక సంక్షోభానికి దాని విధాన వైఫల్యమే కారణమన్నారు. నీట్ పరీక్ష లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేవరకు కాంగ్రెస్ విశ్రమించదని స్పష్టంచేశారు. ఢిల్లీలో జరిగిన ఏఐసీసీ మైనారిటీ విభాగం సలహామండలి సమావేశంలో రాహుల్ మాట్లాడారు. 'మోదీ ప్రభుత్వం ఏడాదిలో కుప్పకూలుతుంది. దీనికి పెరుగుతున్న ఆర్థిక సంక్షోభం ఒక కారణం కానుంది. నీట్ పరీక్ష లీకేజీని నిరసిస్తూ దేశంలో యువత రోడ్లెక్కుతుంటే.. మోదీ ఇటలీ వెళ్లి రీల్స్ చేసుకుంటున్నారు. ఈ లీకేజీ లక్షల మంది విద్యార్థుల భవిష్యత్‌ను నాశనం చేసింది. పలువురు విద్యార్థులు ప్రాణాలు కూడా కోల్పోయారు. దీనికి మోదీ బాధ్యత వహించలేదు. కనీసం విద్యామంత్రి ప్రధాన్‌ను కూడా తొలగించలేదు. ఈ విషయంలో అసలు స్పందించనేలేదు' అని ఆక్షేపించారు. దేశవ్యాప్తంగా ఈ లీకేజీపై నిరసనలు వ్యక్తమవుతున్నాయంటూ.. హైదరాబాద్‌లో ఎన్ఎస్‌యూఐ నేతృత్వంలో జరిగిన భారీ నిరసన ర్యాలీ వీడియోను రాహుల్ తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. "ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేంతవరకూ, నీట్ వంటి ప్రశ్నపత్రాల లీకేజీలను నివారించడానికి ఒక పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేసేంత వరకూ విశ్రమించం." అని పేర్కొన్నారు. కాగా.. ముస్లింలకు సంబంధించిన విషయాలను ప్రస్తావించేటప్పుడు.. మైనారిటీలంటూ విశాలమైన 'ముసుగు' వేయనక్కర్లేదని.. నేరుగా, బహిరంగంగా 'ముస్లిం'ల సమస్యలనే చెప్పి పోరాడాలని శనివారంనాటి సలహా కమిటీ భేటీలో రాహుల్ స్పష్టంచేశారు. ముస్లింలు, దళితులు, ఓబీసీలు, ఇతరులకు ఏదైనా అన్యాయం జరిగితే.. బాధిత వర్గం పేరు చెప్పడానికి సందేహించనవసరం లేదని స్పష్టంచేశారు. భవిష్యత్‌లో హిందూ-ముస్లిం రాజకీయాలు ఉండవని, పెరుగుతున్న అసమానతలు, ద్రవ్యోల్బణం ప్రధాన జాతీయ సమస్యగా మారతాయన్నారు. సామాజిక న్యాయం, రాజ్యాంగ హక్కుల కోసం జూన్ 6న కాంగ్రెస్ మైనారిటీ, ఎస్సీల ఉమ్మడి సదస్సు నిర్వహిస్తుందని వెల్లడించారు. ఆర్థిక సవాళ్ల నుంచి జనం దృష్టి మరల్చేందుకు బీజేపీ, ఆర్ఎ?సఎస్ మతపరమైన విభజన తీసుకొస్తున్నాయని ఆరోపించారు. భవిష్యత్‌లో నిజమైన రాజకీయ పోటీ ధనికులు, పేదల మధ్యే ఉంటుందని చెప్పారు.

**ముస్లింలకు చేరువయ్యేందుకే..**

ముస్లింలకు చేరువయ్యేందుకే రాహుల్ 'ముస్లిం' సందేశం ఇచ్చారని రాజకీయ వర్గాలు అంటున్నాయి. కేరళలో ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ (ఐయూఎంఎల్) మద్దతుతో కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన సంగతి తెలిసిందే. అలాగే అసోం ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిన 19 అసెంబ్లీ స్థానాల్లో 18 మంది ముస్లింలే. ఈ నేపథ్యంలో తన పార్టీపై ముస్లిం ఓటర్లలో విశ్వాసం తిరిగి పాదుగొల్పడం కోసం రాహుల్ తాజా సందేశం ఇచ్చారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అలాగే వచ్చేఏడాది కీలక రాష్ట్రాలైన యూపీ, గుజరాత్, పంజాబ్‌తో పాటు ఉత్తరాఖండ్, గోవా, మణిపూర్, హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో ముస్లింలు, ఎస్సీలకు దగ్గరయ్యేందుకు కాంగ్రెస్ వ్యూహాత్మక సమావేశాలు నిర్వహిస్తోందని.. ఒంటరి పోటీలకూ సిద్ధమవుతున్నట్లుగా ఉందంటున్నారు.

**అరాచకాల సృష్టికి రాహుల్ యత్నాలు: బీజేపీ**

ఏడాదిలో మోదీ సర్కారు కుప్పకూలుతుందన్న రాహుల్‌గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ మండిపడింది. ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు దేశంలో అరాచకాల సృష్టికి ఆయన ప్రయత్నాలు చేస్తున్నారని దుయ్యబట్టింది. విదేశీ శక్తుల ప్రోద్బలంతో మోదీ సర్కారును అస్థిరపరిచేందుకు కుట్రలు పన్నుతున్నారని కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, బీజేపీ నేతలు సుధాంశు త్రివేది, సంబిత్ పాత్రా ఆదివారం విరుచుకుపడ్డారు. ఏఐసీసీ మైనారిటీ విభాగం భేటీలో రాహుల్ వ్యాఖ్యలు 'టూల్‌కిట్ గ్యాంగ్' భారీ కుట్రను బయటపెట్టాయని గోయల్ 'ఎక్స్'లో ధ్వజమెత్తారు. 'ఆయనది మామూలు ప్రకటన కాదు. దేశంలో అరాచకాన్ని వ్యాపింపజేసేందుకు పెద్ద కుట్రగా కనిపిస్తోంది. ప్రత్యక్ష పోరులో బీజేపీని ఓడించలేమని రాహుల్‌కు, ఆయన సహాయకులకు అర్థమైంది. అందుకే దేశవ్యాప్తంగా హింసను ప్రజ్వలింపజేసేందుకు ప్రయత్నిస్తున్నారు' అని ధ్వజమెత్తారు. రాహుల్ మాటల్లో రాజకీయ నిస్పృహ ఉందని.. అంతేగాక దేశాన్ని అస్థిరపరచాలనే ప్రమాదకర మనస్తత్వాన్ని ఆయన బహిరంగంగా చాటుకున్నారని త్రివేది అన్నారు. ఎన్నికల్లో వరుస ఓటములతో కాంగ్రెస్ కుదేలైందని ఎద్దేవా చేశారు.

# కాక్రోచ్ జనతా పార్టీ ఫాలోవర్లపై మాటల యుద్ధం

## రిజిజు X దీప్కే

- పాకిస్థానీ ఫాలోవర్ల కోసం ఆరాటాన్ని చూస్తే జాలేస్తోంది: రిజిజు
- దేశ యువతను పాకిస్థానీయులంటారా?: దీప్కే



న్యూఢిల్లీ, మే 24 : కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) అంశం రోజురోజుకు సంచలనమవుతోంది. సీజేపీకి సోషల్ మీడియాలో ఉన్న ఫాలోవర్లపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు పరోక్షంగా చేసిన ఓ పోస్టు ఆదివారం తీవ్ర దుమారం రేపింది. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే, కేంద్ర మంత్రి రిజిజు మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. పాకిస్థాన్, జార్జ్ సోరోస్ ముఠా నుంచి సోషల్ మీడియా ఫాలోవర్ల కోసం ఆరాటపడుతున్న వారిని చూస్తుంటే జాలేస్తోందంటూ రిజిజు శనివారం ఎక్స్‌లో ఓ పోస్టు చేశారు. అటు సీజేపీని కానీ మరే పార్టీని, వ్యవస్థను కానీ రిజిజు తన పోస్టులో ప్రస్తావించలేదు. కానీ, సీజేపీ ఫాలోవర్ల సంఖ్యపై చర్చ జరుగుతున్న వేళ ఆయన చేసిన ఈ పోస్టు ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, రిజిజు చేసిన పోస్టుకు అభిజిత్ దీప్కే ఎక్స్‌లో ఘాటుగా స్పందించారు. కేంద్ర మంత్రి రిజిజు భారతీయ యువతపై పాకిస్థానీయులనే ముద్ర ఎందుకు వేస్తున్నారు? అంటూ దీప్కే ప్రశ్నించారు. అంతేకాక, తమ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా హ్యాక్ అవ్వకముందు తమకున్న ఫాలోయర్ల భౌగోళిక సమాచారాన్ని తెలియజేసే డేటా ఎనలిటిక్స్ గ్రాఫ్‌ను చూపించే ఓ స్క్రీన్ రికార్డింగ్ వీడియోను తన పోస్టుకు జత చేశారు. తమ ఖాతాను, పోస్టులను అనుసరించే వారిలో 94% మంది భారతీయులేనని దీప్కే స్పష్టం చేశారు. దీప్కే పోస్టుకు స్పందనగా.. కిరెన్ రిజిజు ఆదివారం సాయంత్రం ఎక్స్‌లో మరో పోస్టు చేశారు. సీజేపీని ప్రస్తావించనప్పటికీ.. దేశ వ్యతిరేక ముఠాలకు చెందినవారు భారతదేశానికి ఎప్పటికీ హీరోలు కారని ఘాటుగా వ్యాఖ్యానించారు. "భారత దేశ వ్యతిరేక ముఠాల్లోని హీరోలు ఎప్పటికీ భారతదేశానికి హీరోలు కాలేరు. ప్రజాస్వామ్యం, దేశ యువతపై మాకు పూర్తి విశ్వాసం ఉంది. ప్రపంచంలోని చాలా దేశాలు ప్రస్తుతం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం నిలకడగా ఉంది" అని కిరెన్ రిజిజు పోస్టు చేశారు.

# నౌకాయాన వాణిజ్యానికి ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

ద్వైపాక్షిక, రక్షణ, ఇంధన భద్రత, సాంకేతికత, వీసాలు, సరిహద్దు ఉగ్రవాదం, వాణి జ్య సంబంధాలపై చర్చించారు. అనంతరం జైశంకర్ మీడియా సమావేశం నిర్వహించారు. ప్రపంచ దేశాల్లో ఉద్రిక్తతలు, అంత ర్జాతీయ శాంతి స్థాపనకు ఆయన ఐదు సూ త్రాలు ప్రతిపాదించారు. దేశాల మధ్య ఏవైనా వివాదాలు తలెత్తితే చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే పరిష్కరించుకోవాలని భారత్ మొదటి నుంచి కోరుకుంటున్నదని ఉద్ఘాటించారు. సముద్ర జలాల్లో సురక్షితమైన, అంతరాయం లేని వాణిజ్యానికి తా ము ప్రాధాన్యమిస్తామని తెలిపారు. అంతర్జాతీయ చట్టాలను ప్రతి దేశమూ పాటిం చాలని అభిప్రాయపడ్డారు. ప్రపంచ మార్కె ట్ వాటా, వనరులను కొన్ని దేశాలు తమ స్వార్థం కోసం ఆయుధాలుగా మార్చుకోవడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని కుండబద్దలు కొట్టారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను నష్టాల నుంచి గట్టెక్కించేందుకు నమ్మ కమైన భాగస్వామ్య దేశాలను ఎంచుకుంటామని వివరించారు. ఇంధన ధరల నియం త్రించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. వీసాల విషయంలో అమెరికా అమలు చేస్తు న్న విధానాలు, భారత్ నుంచి వలసలకు ఇబ్బందికరంగా ఉండకూడదని ప్రతిపాదించారు.

**కీలక భాగస్వామి భారత్: రుబియో**

వాణిజ్యంలో భారత్‌కు తమకు కీలక భాగస్వామి అని అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రుబియో స్పష్టం చేశారు. అంతర్జాతీయ సమస్యలను పరిష్కరించగల సామర్థ్యం ఉన్న అతికొది దేశాల్లో భారత్ ఒకటని కొనియాడారు. తమ ఇమ్మిగ్రేషన్ వ్యవస్థను సంస్కరించే క్రమంలో కొన్ని ఇబ్బందులు ఎదురుకావొచ్చని, వలస వచ్చే వారికీ కొన్ని ఆటంకాలు ఏర్పడతాయని కుండబద్దలు కొట్టారు. అయితే.. వాటిని తమ దేశ సంస్కరణల్లో భాగంగానే చూడాలని కోరారు. పటిష్టమైన ఇమ్మిగ్రేషన్ విధా నం అమలులోకి వస్తే.. అది అన్నిదేశాలకూ శ్రేయస్కరమని అభిప్రాయ పడ్డారు. ఇరు దేశాల మధ్య త్వరలోనే పరస్పర ప్రయోజనకరమైన, దీర్ఘకాలిక వాణిజ్య ఒప్పందాలు కుదురుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అమెరికా ఆర్థిక వ్యవస్థలో భారతీయ కంపెనీలు ఇప్పటివరకు 20 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టాయని, ఈ భాగస్వా మ్యం మరింత విస్తరించాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. అమెరికా వలసదారు లకు మిత్రదేశమని మార్కో రూబియో బలంగా చెప్పారు. అగ్రరాజ్యంలో భారతీయులపై వివక్ష చూపడం మూర్ఖులు చేసే పని అంటూ పేర్కొన్నారు. ప్రతి దేశంలో మూర్ఖులు ఉంటారని.. వారు దేశ ఔన్నత్యాన్ని కాపాడలేరు సరికదా.. మరింత దిగజారుస్తారని చెప్పుకొచ్చారు. కొంతకాలం నుంచి భారత్, అమెరికా మధ్య కాస్త గ్యాప్ వచ్చిందనే వాదనలను ఆయన తోసిపుచ్చారు. అమెరికా ఆర్థిక వ్యవస్థకు భారతీ యులు 20 బిలియన్ డాలర్ల వరకు ఆదాయమిస్తున్న విషయాన్ని తాను అంగీకరిస్తా నని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆ మొత్తం ఇంకా పెరగాలని ఆశిస్తున్నట్లు వెల్లడించారు.

# ఒప్పందానికి చేరువలో..

(మొదటి పేజీ తరువాయి)



ఒప్పందం దాదాపు ఖరారైనట్లేనని పేర్కొన్నాయి. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని వెల్లడించాయి. అణ్వాయుధ పరీక్షలకు దూరంగా ఉండాలని, శుద్ధి చేసిన యురేనియంను తమకు అప్పగించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ డిమాండ్ చేస్తున్నారు. అయితే, దీనికి ఇరాన్ ఇప్పటిదాకా బహిరంగంగా అంగీకరించలేదు.

**ఆ నిజాన్ని ఇరాన్ అర్థం చేసుకోవాలి**

ఇరాన్‌తో ఇప్పందం చాలావరకు కుదిరిందని ట్రంప్ శనివారం ప్రకటించారు. ఈ విషయంలో భాగస్వా మిగా ఉన్న మిత్రదేశాలతో మాట్లాడానని చెప్పారు. "ఇరాన్‌తో చర్చలు క్రమబద్ధంగా, నిర్మాణాత్మకంగా సాగుతున్నాయి. సమయం మనకు అనుకూలంగా ఉన్నందున, ఒప్పందానికి తొందరపడవద్దని నా ప్రతినిధులకు తెలియజేశా. ఇరు పక్షాలు కొంత సమయం తీసుకుని సరైన నిర్ణయానికి రావాలి. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాలి"అంటూ ఆదివారం సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. ఇరాన్‌తో అమెరికా సంబంధాలు మరింత ఫలవంతంగా మారుతున్నాయని ఉద్ఘాటించారు. ఒప్పందం కుదిరి, ధ్రువీకరించబడి, సంతకం చేసే వరకూ ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనం పూర్తి స్థాయిలో కొనసాగుతుందని స్పష్టంచేశారు. ఇజ్రాయెల్, అరబ్ దేశాల మధ్య దౌత్య, ఆర్థిక, భద్రతా సంబంధాలను నెలకొల్పే అబ్రహం ఒప్పందంలో చేరాలని ఇరాన్‌ను ట్రంప్ ఆహ్వానించారు. అయితే, అణ్వాయుధాన్ని లేదా బాంబును అభివృద్ధి చేయలేమని లేదా సమకూర్చుకోలేమన్న నిజాన్ని ఇరాన్ అర్థం చేసుకోవాలన్నారు.

**మరికొన్నిగంటల్లో శుభవార్త: రూబియో**

ఇరాన్‌తో చర్చల్లో గణనీయమైన పురోగతి సాధించినట్లు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో తెలియజేశారు. రాబోయే కొన్ని గంటల్లోనే శుభవార్త వినే అవకాశం ఉందని చెప్పారు. ఇరాన్‌తో ఒప్పందంపై అధ్యక్షుడు ట్రంప్ స్వయంగా ప్రకటన చేస్తారని సంకేతాలిచ్చారు. రూబియో ఆదివారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. వివాదాన్ని పరిష్కరించేందుకు సంబంధిత ముసాయిదాపై గత 48 గంటల్లో జరిగిన చర్చల్లో పురోగతి సాధించామని పేర్కొన్నారు. కానీ, ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని వివరించారు. ఇరాన్ వద్ద ఎప్పటికీ అణ్వాయుధాలు ఉండకూడదనేదే అంతిమ లక్ష్యమని స్పష్టంచేశారు. ఇరాన్ అణ్వాయుధాలు కలిగి ఉండడానికి వీల్లేదన్నారు.

**ఒప్పందంలో ఏముంది?**

ఇరాన్ వద్ద ప్రస్తుతం 440.9 కిలోల(972 పౌండ్లు) యురేనియం ఉంది. ఇది 60 శాతం వరకు శుద్ధత కలిగినది. అణ్వాయుధ తయారీకి 90% శుద్ధి చేసిన యురేనియం అవసరం.

అమెరికాతో ఒప్పందంలో భాగంగా ఈ యురేనియంను వదులుకోవడానికి ఇరాన్ ముందుకొచ్చినట్లు తెలుస్తోంది.

ఇరాన్ యురేనియంను ఎలా వదులుకుంటుందనే విషయం 60 రోజుల వ్యవధిలో జరిగే తదుపరి చర్చలకు లోబడి ఉంటుందని చెబుతున్నారు.

యురేనియంలో కొంత భాగాన్ని నిర్వీర్యం చేస్తారు. మిగిలినదాన్ని మూడో దేశానికి బదిలీ చేస్తారు. ఈ యురేనియంను స్వీకరించడానికి రష్యా ముందుకొచ్చింది.

హార్మూజ్ జలసంధిని పూర్తిస్థాయిలో తెరవడానికి, సుంకాలు లేకుండా నౌకాయానికి వీలు కల్పించడానికి ఇరాన్ అంగీకరించింది.

ఒప్పందం కుదిరినట్లేనని అమెరికా వర్గాల సమాచారం. దానిపై ఇంకా సంతకాలు జరగలేదు. ట్రంప్ ఆమోదం లభించాల్సి ఉందని, కొన్ని రోజులు పట్టవచ్చని అంటున్నారు.



## ఘనంగా పి సి సి అధ్యక్షుడి జన్మదిన వేడుకలు...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) మే 24.**

జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య ఆధ్వర్యంలో పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక సామాన్య కార్యకర్తగా జీవితాన్ని ప్రారంభించి ఎన్ ఎస్ యూ ఐ నుండి పిసిసి అధ్యక్షుడిగా తన రాజకీయ ప్రయాణంలో ఒక నిబద్ధత కలిగినటువంటి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు అండగా ఉంటూ ప్రజల గుండెల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మనసులో మంచి స్థానాన్ని పొందగలిగారని మహేష్ కుమార్ గౌడ్ గారి నేతృత్వంలో రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో తప్పకుండా విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల.వాని శ్రీనివాస్, ఏఎంసీ జగిత్యాల చైర్మన్ గడ్డం. నారాయణ రెడ్డి,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొత్తమోహన్, పీసీసీ సెక్రెటరీ బండశంకర్,జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు దుమాల రాజ్ కుమార్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బీరం. రాజేష్ ఆడువాల. లక్ష్మన్, రవీందర్ రావు, పులి నరసయ్య,మహంకాళి రాజన్న,చాంద్ పాశ, కౌన్సిలర్ లు పాల్గొన్నారు.

## పేద కుటుంబం పెద్ద కష్టం ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నా కుటుంబ సభ్యులు

**(కపిల్ వాగ్మారే సిఆర్ కే, ప్రజా తీర్పు భైంసా) మే 24**



రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి. దినమంతా తాపీ పనిచేస్తేనే పూట గడిపే అయన కుటుంబం ఇప్పుడు పెద్ద కష్టంలో పడింది.భైంసా మండలం సిద్దూర్ గ్రామానికీ చెందిన 28 ఏళ్ళ తాపీ మేస్త్రి పూజెకర్ విజయ్ కుమార్ ఇటీవల పనికి వెళ్ళిన రక్తపోటుతో కుప్పకూలి పొయారు.వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.పరిస్థితి విషమంగా ఉందని వైద్యుల సూచనతో నిజామాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆసుత్రికి తీసుకెళ్ళారు. బ్రెయిన్ హేమారెజ్ మెదడులో రక్తనళాలు చిట్లడంగా చూసీ శత్రచికిస్స చేశారు.55 రోజులుగా అక్కడే చికిత్స పొందుతూన్నారు.కుటుంబానికి, అద రమైన ఆయన ప్రణ ప్రయ స్థితిలో ఉండటంతో భార్య కావ్య,రెండుఏళ్ళ చిన్నారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటే బంధువులు, స్నేహితులు,చేసిన సహాయంమంత ఆపోయింది అని, ప్రభుత్వం, దాతలు చేయూత అందించాలని, కోరుతున్నారు. కుటుంబం సభ్యులు. ఫోన్ పే నం 9912795833, 8179702119.



## బోడుప్పల్లో 379వ వారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు జ్ఞానమాల

- భారతీయులందరికీ పవిత్రమైనది 'రాజ్యాంగం'
- ప్రతి ఒక్కరు భారత రాజ్యాంగాన్ని చదివి ఆచరించాలి.
- అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, నత్తి మైసయ్య.

**బోడుప్పల్, మే 24: ( ప్రజాతీర్పు )**

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 379వ ఆదివారం జ్ఞానమాల సమర్పించి భారత రాజ్యాంగ నిర్మాణం కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం నత్తి మైసయ్య మాట్లాడుతూ భారతదేశంలో విభిన్న కులాలు, మతాలు, వివిధ సంస్కృతి, సాంప్రదాయాలు ఆచార వ్యవహారాలు ఉన్నాయి, ఆయా మతాలకు మత గ్రంథాలు కూడా ఉన్నప్పటికీ, అందరినీ గౌరవిస్తూ, కుల,జాతి, మత, వర్గ విభేదాలు లేకుండా అందరికీ సమాన హక్కులు విధులు కల్పించిన గ్రంథం భారత రాజ్యాంగమని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ త్యాగ ఫలితంగా, ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాంగంగా పేరు ప్రఖ్యాతలు సంపాదించిన మన రాజ్యాంగాన్ని ప్రతి భారతీయుడు చదవాలని, అందులోనే అంశాలను అర్థం చేసుకొని ప్రతి ఒక్కరు అత్యుత్తమ పౌరులుగా, ఎదగాలని, బడుగు, బలహీన వర్గాలు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించినప్పుడే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కలలుగన్న భారతదేశం నిర్మితమవుతుందని, ప్రతి ఒక్కరు తమ మత గ్రంథాలతో పాటు భారత రాజ్యాంగాన్ని కూడా పవిత్ర గ్రంథంగా భావించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు బుగ్గ మైసయ్య, రాపోలు శ్రీరాములు, రాపోలు వెంకటేష్, గరుగుల యాకయ్య, చిల్ల అంజయ్య, బండారి సాయి, యేసు రాజు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎం పార్టీకి, శాఖ కార్యదర్శి గిరిజన నాయకుడు భూక్యా పూల్ సింగ్ రాజీనామా

**(పగడాల రామారావు ప్రజా తీర్పు గాన మండల ప్రతిని ధి) మే 24**



గార్ల. స్థానిక మండల పరిధి శేరీపురం మర్రిగూడెం గ్రామానికి చెందిన భూక్యా పూల్ సింగ్ పార్టీ శాఖ కార్యదర్శి గా, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన తన రాజీనామా లేఖను పార్టీ అధిష్టానానికి పంపినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా భూక్యా పూల్ సింగ్ మాట్లాడుతూ. గత కొంతకాలంగా స్థానిక నాయకుల ప్రవర్తన, వారి ధోరణి అసంతృప్తికరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. “స్థానిక నాయకత్వ పోకడలు నచ్చకే తీవ్ర మనస్తాపంతో పార్టీ వీడాల్సి వస్తోంది అని అన్నారు. అందుకే సిపిఎం పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నాను.” భూక్యా పూల్ సింగ్ గార్ల మండలం మహబూబాబాద్ జిల్లా.

# బీసీ మహిళా నాయకురాలిపై వ్యాఖ్యలు మానుకోవాలి..

- కాంగ్రెస్ నేతలకు ఓరుగంటి చంద్రశేఖర్ హెచ్చరిక...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) మే 24.**



జగిత్యాలలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాంగ్రెస్ నాయకుల తీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కేంద్రీయ విద్యాలయం అంశంపై మాట్లాడుతున్న ఒక బీసీ మహిళా నాయకురాలిపై కాంగ్రెస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని అన్నారు. ఇటీవల కలెక్టరేట్‌లో ప్రజాపాలన వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన “ఎడ్యుకేషనల్ ఎక్సలెన్స్ విజయోత్సవం” కార్యక్రమం ప్రభుత్వ కార్యక్రమంలా కాకుండా కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలా నిర్వహించబడిందని ఆరోపించారు. అధికారిక కార్యక్రమంలో ఎటువంటి పదవులు లేని కాంగ్రెస్ నాయకులు నందయ్య, గిరినాగభూషణం, బండ శంకర్‌లను అధికారులతో పాటు వేదికపై కూర్చోబెట్టడంపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నందయ్యకు స్కూల్‌లో ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారో కూడా తెలియకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని చంద్రశేఖర్ విమర్శించారు. గూగుల్‌లో చూసినా కేంద్రీయ విద్యాలయంలో 1000 నుంచి 1200 మంది వరకు విద్యార్థులు చదువుతున్నారని తెలుస్తుందని అన్నారు. చదువు గురించి కాంగ్రెస్ నాయకులు మాట్లాడటం “దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది” అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అయితే తమ నాయకురాలు భోగ శ్రావణి ఇక్కడి మీ ఎమ్మెల్యే సంజయ్ కుటుంబ సభ్యులు లాగా హైదరాబాద్ నుండి జగిత్యాల వచ్చి ఇక్కడ కాంట్రాక్టులు తీసుకొని చేయడం లేదని గుర్తు చేశారు. అనంతరం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మ్యాదరి అశోక్ కాంగ్రెస్ నాయకుల తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. డీసీసీ అధ్యక్షుడు నందయ్య తొలిసారిగా స్వతంత్రంగా ప్రెస్‌మీట్ నిర్వహించడం సంతోషకరమేనని, కానీ ఒక బీసీ మహిళా నాయకురాలు ఎదగడాన్ని జీర్ణించుకోలేక ఎమ్మెల్యే ప్రేరేపణతో మాట్లాడటం బాధాకరమని అన్నారు. గతంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా అడ్లూరి లక్ష్మణ్ అనేక ప్రెస్‌మీట్లు నిర్వహించారని, అయితే నందయ్య పరిస్థితి చూస్తే ఆయన పూర్తిగా ఎమ్మెల్యే ఆధీనంలో పనిచేస్తున్నట్టు కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. “ఒక బీసీ ఆడబిడ్డ ఎదుగుదలను అడ్డుకోవడానికే నిన్ను ముందుకు నెట్టారు” అంటూ విమర్శించారు. శ్రావణి భర్త వృత్తిరీత్యా వైద్యుడని, హైదరాబాద్‌లో ఆస్పత్రి నిర్వహిస్తూ సేవలు అందిస్తున్నారని తెలిపారు. అదే ఎమ్మెల్యే కూడా ఆయన వద్ద చికిత్స తీసుకున్నారని అన్నారు. “వాళ్లు హైదరాబాద్‌లో ఉద్యోగాలు, వృత్తులు చేసుకుంటే తప్పా?” అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలకు అర్థం లేదని, రాష్ట్ర స్థాయి నాయకురాలిగా శ్రావణి తరచూ హైదరాబాద్ వెళ్లి రావడం సహజమని చెప్పారు. “మా మేడం లోకల్ లీడర్ కాదు, రాష్ట్ర నాయకురాలు. పార్టీ రాష్ట్ర కార్యాలయం హైదరాబాద్‌లో ఉంటుంది” అని స్పష్టం చేశారు. గాంధీ భవన్ మెట్లు ఎక్కని వారు ఇప్పుడు పెద్దగా మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. కార్యకర్తలను పార్టీ కార్యాలయానికి తీసుకెళ్లి పని చేసిన అనుభవం కాంగ్రెస్ నాయకులకు ఉందా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో జగిత్యాల పట్టణ అధ్యక్షులు కొక్కు గంగాధర్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓరుగంటి చంద్రశేఖర్,జిల్లా ఉపాధ్యక్షులు మ్యాదరి అశోక్,జిల్లా కార్యదర్శి పాత రమేష్, ఆముద రాజు, దూరిశెట్టి మమత, మేడిపల్లి పుష్ప, ఇట్యాల రాము, పవన్ సింగ్, సింగం పద్మ, మామిడాల కవిత, సిరిపురం శ్రీనివాస్ మరియు తదితరులు పాల్గొన్నారు.



## ఎల్లారం పోచమ్మ తల్లి నీ దర్శించుకున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి

**(దండే భూమన్న ప్రజా తీర్పు మంచిర్యాల జిల్లా ప్రతినిధి) మే 24**

బెల్లంపల్లి నియోజకవర్గం ఎల్లారం పోచమ్మ టెంపుల్ ను సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మరియు బెల్లంపల్లి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రామచందర్ ఆధ్వర్యంలో మన బెల్లంపల్లి శాసనసభ్యులుఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి పోచమ్మ తల్లిని దర్శించుకుని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుల ముఖ్య సమావేశంలో పాల్గొని కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు సీనియర్ నాయకులకు అండగా ఉంటుందని కాంగ్రెస్ సీనియర్ పార్టీ నాయకులు మర్రి చెట్టు లాంటి వాళ్ళని కొనియాడారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి అన్నారు. రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ టిపిసిసి నాతరి స్వామి మరియు బెల్లంపల్లి మున్సిపాలిటీ చైర్మన్ దావ స్వాతి రమేష్, పాల్గొన్నారు. నెన్నెల్ మండల్ కాంగ్రెస్ పార్టీఅధ్యక్షుడు గట్టు మల్లేష్ ఆధ్వర్యంలో మంచర్ల వెంకటేష్, నేన్నల్ మాజీ సర్పంచ్ తోట సుజాత శ్రీనివాస్, గట్టు బానేష్, గొల్లపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తమ్మినవేని రాజేష్, నిన్నల్ మండల్ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుపతి, మరియు గుండ్ల సోమవారం సర్పంచ్ సింగం తిరుపతి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దుర్గం రవి, ధరావత్ రమేష్, సింగిల్ విండో డైరెక్టర్ ఉయ్యాల లింగయ్య, మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు ఉయ్యాల మల్లికా దేవి పాల్గొన్నారు.




## ఖానాపూర్‌లో ఘనంగా పీసీసీ అధ్యక్షుడి పుట్టినరోజు వేడుకలు

**ఖానాపూర్,మే 24(ప్రజా తీర్పు ప్రతినిధి):**

నిర్మల్ జిల్లా ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మా బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలను ఖానాపూర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు కేక్ కట్ చేసి మహేష్ కుమార్ గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతోందని అన్నారు.పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న నాయకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు.ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవిస్తూ పార్టీకి, ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జంగిలి శంకర్,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గౌర్రె గంగాధర్,డీసీసీ ఉపాధ్యక్షుడు రాజుర సత్యం,కౌన్సిలర్ నిమ్మల రమేశ్,ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం,డీసీసీ అధికార ప్రతినిధి దయానంద్,కార్యదర్శి అంకం రాజేందర్, కార్యవర్గ సభ్యులు జన్నారపు శంకర్,నేరేళ్ల సత్యనారాయణ, ధ్యావతి రాజేశ్వర్,లాలూ నాయక్, కావాలి సంతోష్,శౌకత్ పాషా, మడిగేల గంగాధర్,డీలర్ రాజేందర్,దాసరి రాజన్న,శేషాద్రి, దాసరి రాజేశ్వర్,గుడిమందుల శ్రీహరి,ములుగురి శ్రీహరి తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి





## రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి

**(వి.వెంకటేష్,ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) మే 24**

రైతు సంక్షేమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఖమ్మం జిల్లా నుండి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వివిధ ప్రాంతాల నుండి రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, ఇతర అధికారులతో కలిసి ఇతర మంత్రులు, అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులు, పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసన సభ్యులతో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 141 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం సాగు జరిగిందని, ఇందులో 75 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు లక్ష్యంగా కనీస మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 8 వేల 575 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, 8 వేల 749 కోట్ల రూపాయల కనీసం మద్దతు ధరను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 21 కోట్ల గోనె సంచులను క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంచడం జరిగిందని, కొనుగోలు కేంద్రాలలో వేచి ఉన్న 8 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేపట్టాలని తెలిపారు. ఈ నెల చివరికల్లా కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని, సరిహద్దు జిల్లాలలో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి బయట రాష్ట్రాల నుంచి వరి ధాన్యము, జొన్నలు, మొక్కజొన్నలు రాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని తెలిపారు. తాలు, తరుగు విషయంలో రైస్ మిల్లర్లు, దళారులు రైతులను మోసం చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు త్వరగా టాబ్ లో నమోదు చేసి రైతులకు నగదు చెల్లింపు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతులకు ఎలాంటి నష్టం రాకుండా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు విషయంలో తప్పుడు వార్తలను ఖండించాలని, ప్రతికూల వార్తలపై అధికారులు వెంటనే స్పందించాలని, రికార్డు స్థాయిలో కొనుగోలు చేసిన విషయాలను ప్రచారం చేయాలని తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని, సరిపడా హమాలీల సంఖ్యను పెంపొందించుకోవాలని తెలిపారు. గతంలో రైతులు వరి ధాన్యం కొనుగోలు నగదు చెల్లింపు విషయంలో నెలల తరబడి వేచి ఉండవలసి వచ్చేదని, ఇప్పుడు వెంటనే చెల్లింపులు చేయడం జరుగుతుందని తెలిపారు. పట్టణాల అభివృద్ధిలో భాగంగా వాయు కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇందులో భాగంగా వ్యవసాయ వ్యర్థాల కాల్చివేసే రైతులకు వాయు కాలుష్య నివారణపై అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, పంచాయతీరాజ్– గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ లతో కలిసి 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 25 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న మహిళా సంక్షేమ వారంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామ, మండల స్థాయిలో ఇందిరా మహిళా శక్తి భవనాలు, అంగన్వాడీ కేంద్రాల శంకుస్థాపన, మహిళల భద్రత, పోష్ చట్టంపై అవగాహన కల్పించడం, సోలార్ పవర్ ప్లాంట్ల స్థాపన, మహిళ మండల సమాఖ్య ప్రత్యేక సాధారణ కార్యవర్గ సమావేశాల నిర్వహణ, ఉల్లాస్ కార్యక్రమం, అమ్మ మాట – అంగన్వాడి బాట కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై కార్యక్రమాలు నిర్వహించవలసి ఉంటుందని తెలిపారు. మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని, అకాల వర్షాల కారణంగా ధాన్యం దెబ్బ తినకుండా జిల్లాలో గుర్తించిన గోదాములు, కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు ధాన్యం తరలించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా స్థాయి అధికారుల సమన్వయంతో ప్రతిరోజు వరి ధాన్యం ప్రక్రియ పురోగతిపై పర్యవేక్షించడం జరుగుతుందని, వేగవంతానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు సౌకర్యాలు కల్పించడంతో పాటు సీఎంఆర్ ప్రక్రియ పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కార్యక్రమాలను అధికారుల సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

# వరి కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- తరుగు పేరిట కోతలు విధిస్తే చర్యలు
- మహిళా వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,మే 24(ప్రజాతీర్పు ):**



వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం పలువురు మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాల వారీగా కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను సమీక్షించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. అవసరమైన చోట స్థానిక హమాలీలను నియమించుకోవాలని, రవాణా సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కలెక్టర్లు నిరంతరం కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షించాలని పేర్కొన్నారు. తాలు, తరుగు పేరిట రైతుల ధాన్యంలో కోతలు విధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా ఈ నెల 25 నుంచి 30 వరకు నిర్వహించే మహిళా వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. 'మహిళా ఉన్నతి -- తెలంగాణ ప్రగతి' నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళా అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ భవేశ్ మిశ్రా అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో మరింత వేగం పెంచాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా కొనుగోళు పూర్తి చేసి, రోజువారీ లక్ష్యాలను సాధించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మహిళా వారోత్సవాలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని, ప్రతిరోజూ కార్యక్రమాలను మహిళలు, అధికారులు, ప్రజల భాగస్వామ్యంతో చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఏఎస్పీ సాయికిరణ్, పౌర సరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, డీఎం మార్క్‌ఫెడ్ మహేష్, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ అధికారి వినూత్న, హార్టికల్చర్ అధికారి రమణ తదితరులు పాల్గొన్నారు.

## మహిళ అదృశ్యం

**మేడిపల్లి, మే 24:( ప్రజాతీర్పు )**



మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని చెంగిచర్ల ప్రాంతానికి చెందిన శ్రీమతి భూక్య తిరుమల డబ్ల్యూ /ఓ బిక్షపతి నాయక్, వయస్సు: 38 సం.రాలు, వృత్తి: గృహిణి అనే మహిళ తేదీ 21.05.2026 రాత్రి 21.15 గంటల సమయంలో అపోలో ఫార్మసీ, చెంగిచెర్ల కు మందులు కొనడానికి వచ్చి అక్కడి వద్ద నుండి అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలలో వెతికినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. వ్యాపార ఆర్థిక సమస్యల కారణంగా ఆమె ఇంటి నుండి వెళ్లి ఉండవచ్చునని కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## మందుల దుకాణాల యజమానుల సంఘ కార్యవర్గ నియామకం

**( ఎలుక భగవాన్ యాదవ్, ప్రజాతీర్పు, ఎండపల్లి) మే 24:**

జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం లోని మెడికల్ ఒ జనరల్ స్టోర్ యజమానులు మండల కేంద్రంలో నిర్వహించుకున్న సర్వసభ్య సమావేశం లో సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గంలో అధ్యక్షులుగా వైద్య సతీష్, ప్రధాన కార్యదర్శిగా సంద కన్నయ్య లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పూర్తిస్థాయి కార్యవర్గాన్ని త్వరలో ప్రకటిస్తామని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ షాప్ యజమానులు బైకని రవీందర్ యాదవ్, తోడేటి మల్లేశం గౌడ్, మోకెనపల్లి సతీష్, అనిల్, సుధీర్, మహేష్, మండలంలోని మెడికల్ షాప్ ల యజమానులు పాల్గొన్నారు.



## క్యాంపెయిన్ 360 పోస్టర్ ను ఆవిష్కరించిన జాన్సన్ నాయక్

**ఖానాపూర్,మే 24(ప్రజా తీర్పు ప్రతినిధి):**

బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు రూపొందించిన క్యాంపెయిన్ 360 అప్లికేషన్ పోస్టర్‌ను బీఆర్ఎస్ పార్టీ నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ ఆవిష్కరించారు. ఖానాపూర్‌లోని ఆయన క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు,కార్యకర్తల సమక్షంలో పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా జాన్సన్ నాయక్ గారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త తప్పనిసరిగా క్యాంపెయిన్ 360 యాప్‌ను తమ మొబైల్ ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు. ఈ యాప్ ద్వారా పార్టీ కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్లు,వీడియోలు, సోషల్ మీడియా కంటెంట్‌తో పాటు తాజా సమాచారం సులభంగా అందుబాటులో ఉంటుందని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, అభివృద్ధి కార్యక్రమాలు, నాయకుల సందేశాలను ప్రజల్లోకి వేగంగా తీసుకెళ్లేందుకు ఈ అప్లికేషన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. సోషల్ మీడియా వేదికలను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా పార్టీ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, సోషల్ మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇండ్ల పేరుతో మోసాలు నమ్మొద్దు

**ఖానాపూర్,మే 24(ప్రజా తీర్పు ప్రతినిధి):**

ఇందిరమ్మ ఇండ్ల పేరుతో మధ్యవర్తులు, దళారులు పేద ప్రజలను మోసం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని,అలాంటి వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని నిర్మల్ జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడు రాజుర సత్యం ప్రజలకు సూచించారు. ఆదివారం పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎవరైనా డబ్బులు అడిగితే వారికి స్పందించవద్దని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన వివరాల కోసం ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ని,స్థానిక కౌన్సిలర్లను లేదా కాంగ్రెస్ పార్టీ నాయకులను నేరుగా సంప్రదించాలని కోరారు. ప్రభుత్వం అర్హులైన ప్రతి పేద కుటుంబానికి న్యాయం చేస్తుందని తెలిపారు. అదేవిధంగా త్వరలో ప్రభుత్వం అందించనున్న భరోసా పింఛన్ పథకానికి సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి విధి విధానాలు విడుదల కాలేదని, ప్రజలు ఎలాంటి అయోమయానికి గురికావద్దని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నిమ్మల రమేష్,ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం,మండల అధ్యక్షుడు జంగిలి శంకర్,పట్టణ అధ్యక్షుడు గౌరె గంగాధర్,డీసీసీ అధికార ప్రతినిధి దయానంద్,కార్యదర్శి అంకం రాజేందర్, కార్యవర్గ సభ్యులు జన్నారపు శంకర్,నేరేళ్ల సత్యనారాయణ,ధ్యావతి రాజేశ్వర్,లాలూ నాయక్,కావాలి సంతోష్,షౌకత్ పాషా, మడిగేల గంగాధర్,డీలర్ రాజేందర్,దాసరి రాజన్న,శేషాద్రి, దాసరి రాజేశ్వర్,గుడిమందుల శ్రీహరి,ములుగురి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి అంబేద్కర్ యువజన సంఘం ఆర్థిక సహాయం

**ఖానాపూర్,మే 24(ప్రజా తీర్పు ప్రతినిధి):**

నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన బొమ్మెన మౌనిక హత్య ఘటనపై అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మౌనిక చిత్రపటానికి నివాళులర్పించి,ఆమెను హత్య చేసిన భర్త అరుణ్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం మౌనిక కుటుంబానికి సంఘం తరఫున రూ. 10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అంబేద్కర్ యువజన సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మండల,పట్టణ అధ్యక్షులు మేస సతీష్, చుక్కల నరేష్, సీనియర్ నాయకులు ద్యావతి రాజేశ్వర్,జన్నారపు శంకర్,దాసరి రాజన్న, దాసరి రాజేశ్వర్,చుక్కల రాజేశ్వర్, గుడిమందుల శ్రీహరి,బొమ్మెన రాజు,కుమారస్వామి, బత్తుల నారాయణ, నేరెళ్ల విక్కీ,మద్దెల కృష్ణ, గాజుల అజయ్ పాల్గొన్నారు.



## దొమ్మటి సదయ్యకు ఘన నివాళులు

**(దుర్గం నగేష్, ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), మే 24 :**

నిస్వార్థ సామాజిక సేవా నాయకుడు, బహుజన ఉద్యమానికి అండగా నిలిచిన రైల్వే ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు దొమ్మటి సదయ్య మృతిపై పలువురు సామాజిక నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. పెద్దపల్లి మండలం అందుగులపల్లి గ్రామంలోని ఆయన స్వగృహంలో పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సామాజిక నాయకులు మామిడిపల్లి బాపన్న, లింగమల్ల శంకరయ్య టీచర్, మల్లేష్, సత్యనారాయణ, అనిల్ తదితరులు పాల్గొన్నారు. దొమ్మటి సదయ్య అకాల మరణం సమాజానికి, కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. బహుజన ఉద్యమం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు ప్రకృతి మనోధైర్యం ప్రసాదించాలని ప్రార్థించారు. "జోహార్ దొమ్మటి సదయ్య" అంటూ నివాళులర్పించారు.

## ఆంశిక మృతిపై డా. చిరుమిల్ల రాకేష్ సంతాపం

**(దుర్గం నగేష్ ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), మే 24:**



పెద్దపల్లి జిల్లా కేంద్రానికి చెందిన ఉమా మహేశ్వర సార్ మనవరాలు, నాగరాజు కుమార్తె ఆంశిక ఇటీవల మృతి చెందడంతో టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. చిరుమిల్ల రాకేష్ కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతురాలి నివాసానికి వెళ్లిన ఆయన ఆంశిక చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. చిన్న వయసులో ఆంశిక మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




## సమతా సైనిక్ దళ్ శతాబ్ది మహాసభలను విజయవంతం చేయాలి

### తెలంగాణ నుంచి భారీగా తరలిరావాలని డా. మార్షల్ దుర్గం నగేష్ పిలుపు

**గోదావరిఖని , మే 24, (ప్రజాతీర్పు)**

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్థాపించిన సమతా సైనిక్ దళ్ శతాబ్ది మహాసభలను ఈ నెల 31న ముంబైలో ఘనంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రం నుంచి సమతా సైనికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సమతా సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. మార్షల్ దుర్గం నగేష్ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రామ్ గణేష్ గడ్కరీ రంగాయతన్ థియేటర్‌లో ఈ మహాసభలు జరగనున్నాయని తెలిపారు. దేశవ్యాప్తంగా అంబేద్కర్ వాదులు, సామాజిక ఉద్యమకారులు, సమతా సైనిక్ దళ్ నాయకులు, యువజన ప్రతినిధులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. 1926లో అంబేద్కర్ స్థాపించిన సమతా సైనిక్ దళ్ సామాజిక న్యాయం, సమానత్వం, స్వాభిమాన పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతోందని డా. నగేష్ తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణ, అణగారిన వర్గాల హక్కుల సాధనలో సమతా సైనిక్ దళ్ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాజ్యాంగ విలువలపై దాడులు పెరుగుతున్నాయని, యువత అంబేద్కర్ ఆశయాల దిశగా సంఘటితంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. శతాబ్ది మహాసభల్లో సామాజిక న్యాయం, దళిత--బహుజన హక్కులు, ప్రజాస్వామ్య పరిరక్షణ, యువత పాత్ర వంటి అంశాలపై విస్తృత చర్చలు జరగనున్నాయని తెలిపారు. తెలంగాణలోని ప్రతి జిల్లా నుంచి ప్రత్యేక బృందాలతో సమతా సైనికులు మహాసభలకు హాజరుకావాలని ఆయన కోరారు. అంబేద్కర్ ఆశయాల సాధనకు ఐక్యపోరాటమే మార్గమని, శతాబ్ది మహాసభలు ఆ దిశగా కొత్త ఉత్సాహాన్ని నింపుతాయని డా. మార్షల్ దుర్గం నగేష్ పేర్కొన్నారు.

# అభివృద్ధిని చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ ఆరోపణలు

### కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు భూషణవేణి సురేష్ గౌడ్ విమర్శ

**(దుర్గం నగేష్, ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), మే 24**



పెద్దపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలకు దిగుతున్నారని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు భూషణవేణి సురేష్ గౌడ్ విమర్శించారు. ఆదివారం పట్టణంలోని సిరి ఫంక్షన్ హాల్లో మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్యపై చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పెద్దపల్లి నియోజకవర్గం అవినీతి, అక్రమాల కేంద్రంగా మారిందని ఆరోపించారు. మట్టి, ఇసుక దందాలు పెరిగాయని, రైతుల నుంచి వడ్ల కొనుగోళ్ల సమయంలో తరుగు పేరుతో భారీ దోపిడీ జరిగిందన్నారు. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి హయాంలో ప్రజా సమస్యలను పట్టించుకోకుండా అక్రమ వ్యవహారాలకు ప్రాధాన్యం ఇచ్చారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన రోడ్లు, డ్రైనేజీలు నాణ్యత లేకుండా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. మున్సిపల్ కౌన్సిల్ ఏర్పడిన తర్వాత రెండు నెలల్లోనే దెబ్బతిన్న రోడ్లు, డ్రైనేజీల మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఉపశమనం కల్పించామని పేర్కొన్నారు. ప్రస్తుతం పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ పారదర్శక పాలన అందిస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యే విజయరమణారావు రైతు పక్షపాతిగా వ్యవహరిస్తున్నారని, వడ్ల కొనుగోలు కేంద్రాలను స్వయంగా సందర్శిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఎక్కడా కటింగ్స్ లేకుండా పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయని, మరో వారం రోజుల్లో కొనుగోలు ప్రక్రియ పూర్తవుతుందని వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై బహిరంగ చర్చకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని, దమ్ముంటే బీఆర్ఎస్ నాయకులు ప్రజల ముందుకు రావాలని సవాల్ విసిరారు. ఆధారాలు లేకుండా కాంగ్రెస్ నాయకులపై అసత్య ప్రచారం చేస్తే సహించబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో పట్టణ కాంగ్రెస్ కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వరి ధాన్యాన్ని నిబంధనల ప్రకారం నిల్వ చేయాలి





జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

(వి.వెంకటేష్, ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) మే 24

రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం గోదాములు, రైస్ మిల్లులలో నిబంధనల ప్రకారం నిల్వ చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం జిల్లాలోని జైపూర్ మండలం ముదిగుంటలో గల బి. ఎస్.వై. రైస్ మిల్, ఇందారంలో గల వరలక్ష్మీ రైస్ మిల్, బాలాజీ రైస్ మిల్, సుముఖ రైస్ మిల్ గోదాం, కుందారం లోని అన్నపూర్ణ రైస్ మిల్ లను ఆర్.ఐ. తిరుపతి తో కలిసి సందర్శించి ధాన్యం ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు, గోదాములకు తరలించాలని తెలిపారు. గోదాములకు తరలించిన ధాన్యం దిగుమతిలో ఆలస్యం లేకుండా వేగంగా పూర్తి చేయాలని, అవసరం మేరకు హమాలీల సంఖ్యను పెంపొందించుకోవాలని తెలిపారు. లారీలు వేచి ఉండకుండా తిరిగి పంపించాలని తెలిపారు. రైస్ మిల్లర్లకు నిర్దేశించిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేసే విధంగా కృషి చేయాలని తెలిపారు. సి. ఎం. ఆర్. లక్ష్యాలను వేగంగా పూర్తి చేసేలా రైస్ మిల్లుల యజమానులు అధికారుల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. హాజీపూర్ మండల కేంద్రంలోని గాయత్రి రైస్ మిల్ ను జిల్లా పౌర సారఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ లతో కలిసి సందర్శించి ధాన్యం ప్రక్రియను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. లక్సెట్టిపేట మండలంలో గల శ్రీరామ రైస్ మిల్, శ్రీరామచంద్ర రైస్ మిల్, శివ సాయి రైస్ మిల్, శ్రీ శివరామకృష్ణ రైస్ మిల్ లను జిల్లా పౌరసరఫరాల అధికారి, జిల్లా మేనేజర్, మండల తహసిల్దార్ దిలీప్ కుమార్ లతో కలిసి సందర్శించి ధాన్యం ప్రక్రియను పరిశీలించారు. అనంతరం దండేపల్లి మండలంలోని శ్రీ వెంకటేశ్వర రైస్ మిల్, రాధాకృష్ణ రైస్ మిల్, రామ్ లక్ష్మణ్ రైస్ మిల్, జయలక్ష్మి రైస్ మిల్ లను జిల్లా పౌరసరఫరాల అధికారి, జిల్లా మేనేజర్, మండలం పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్ లతో కలిసి సందర్శించి ధాన్యం ప్రక్రియను పరిశీలించారు. లక్ష్మీనరసింహ గోదామును సందర్శించి ధాన్యం తరలింపు, నిల్వ లకు సంబంధించి అందుబాటులో ఉన్న అవకాశాలను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల నుండి నిబంధనల ప్రకారం కొనుగోలు చేసిన ధాన్యాన్ని గుర్తించిన గోదాములకు, రైస్ మిల్లులకు కేటాయించిన ప్రకారం తరలించడం జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ధాన్యం రవాణాకు అవసరమైన లారీలను అందుబాటులో ఉంచడం జరుగుతుందని, రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సింగరేణిలో పెండింగ్‌లో ఉన్న విజిలెన్స్ డిపెండెంట్ ఉద్యోగాలు పరిష్కరించాలి మొలుమూరి శ్రీనివాస్

రామగిరి, మే 24 (ప్రజాతీర్పు)

సింగరేణి కంపెనీలో గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న విజిలెన్స్ డిపెండెంట్ ఉద్యోగాల సమస్యను వెంటనే పరిష్కరించాలని బిజెపి నాయకులు మరియు మాజీ ఎంపిటిసిల ఫోరం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రామగిరి మండలం సెంటనరీ కాలనీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విజిలెన్స్ కేసుల కారణంగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న కార్మిక కుటుంబాలు ఎన్నో సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించకపోతే బాధిత కుటుంబ సభ్యులందరినీ తీసుకుని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఉద్యోగాలు రాక కార్మిక కుటుంబాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో కూరుకుపోయాయని, రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితికి చేరుకున్నప్పటికి సింగరేణి యాజమాన్యం వారి సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. కుటుంబ పోషణ కోసం కుమారుడు, అల్లుడు లేదా కూతురికి ఉద్యోగం లభిస్తుందనే ఆశతో కార్మికులు మెడికల్ అన్‌ఫిట్ అయిన తర్వాత కారుణ్య నియామకాల కోసం దరఖాస్తు చేసుకుంటే, పేర్లలో తప్పులు ఉన్నాయని, కులాల వివరాల్లో వ్యత్యాసాలు ఉన్నాయని చెబుతూ ఉద్యోగాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అంతే కాకుండా ఉద్యోగం ఇవ్వలేని పరిస్థితుల్లో చెల్లించాల్సిన రూపాయలు 25 లక్షల పరిహారాన్ని కూడా అందించకుండా కార్మిక కుటుంబాలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా సింగరేణి అధికారుల తీరు మారలేదని, గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ విజిలెన్స్ కేసులను పరిష్కరించాలని సూచించినప్పటికి అధికారులు ఆదేశాలను అమలు చేయలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సింగరేణి కంపెనీపై సరైన అవగాహన లేదని, ఐఎన్‌టియుసి నాయకత్వం కూడా ఈ సమస్య పరిష్కారంపై చొరవ చూపడం లేదని విమర్శించారు. విజిలెన్స్ కేసుల్లో పెండింగ్‌లో ఉన్న కార్మిక కుటుంబాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేకపోతే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బి జె పి టౌన్ అధ్యక్షుడు తీగల శ్రీధర్, సీనియర్ నాయకులు మెరుగు శ్రీకాంత్, దొంతుల సురేష్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

## తిలక్‌నగర్‌లో పోలీసుల కార్డన్-సెర్చ్ నిర్వహణ

- హెల్మెట్ ధరించండి.. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండండి
- ప్రజల సహకారంతోనే నేర నియంత్రణ సాధ్యం : డీసీపీ



(దుర్గం నగేష్ ,ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మే 24):

నేర నియంత్రణ, ప్రజా భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా గోదావరిఖని తిలక్‌నగర్ ప్రాంతంలో పోలీసులు కార్డన్–సెర్చ్ నిర్వహించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్, గోదావరిఖని ఉపవిభాగ పరిధిలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీసీపీ మాట్లాడుతూ వాహనదారులు తమ వాహన పత్రాలను ఎప్పటికప్పుడు సరిచూసుకుని సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. జరిమానాల భయం కోసం కాకుండా ప్రాణరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. తక్కువ దూరం ప్రయాణమైనా హెల్మెట్ అవసరం లేదనే భావన ప్రమాదకరమని పేర్కొన్నారు. ప్రమాదం ఎప్పుడు, ఎక్కడ సంభవిస్తుందో తెలియదని, ప్రతి ప్రయాణంలోనూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలు నడపడం, అతివేగంగా ప్రయాణించడం వల్ల తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీసీపీ సూచించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే లింకులను క్లిక్ చేయవద్దని, వాటి ద్వారా బ్యాంకు ఖాతాల్లోని డబ్బు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అదనపు డబ్బు, బహుమతుల పేరుతో వచ్చే ప్రలోభాలకు మోసపోవద్దని హెచ్చరించారు. మోసపోయిన తర్వాత ఫిర్యాదు చేయడం కంటే ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడం మంచిదన్నారు. అనుమానాస్పద లావాదేవీలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. డిజిటల్ లావాదేవీల విషయంలో కుటుంబ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. నేరరహిత సమాజ నిర్మాణంలో ప్రజల పాత్ర కూడా కీలకమని డీసీపీ పేర్కొన్నారు. ప్రజలే యూనిఫాం లేని పోలీసులని పేర్కొంటూ, తమ పరిసరాల్లో జరిగే అనుమానాస్పద, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై సమాచారం అందించాలని కోరారు. ప్రజలు ఇచ్చే సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని తెలిపారు. గంజాయి వంటి మత్తు పదార్థాలపై పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరిస్తోందని, సరఫరా లేదా విక్రయాలపై సమాచారం అందితే వెంటనే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. యువత మత్తుకు దూరంగా ఉండి కష్టపడి ఎదగాలని, బాధ్యతాయుత పౌరులుగా మారాలని డీసీపీ పిలుపునిచ్చారు.

## గురుకుల పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం...

(ఎర్రోజు విష్ణు చారి, ప్రజాతీర్పు సిద్దిపేట ప్రతినిధి) మే 24

సిద్దిపేట పట్టణంలో నాసర పురలోగల అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో నాలుగవ తరగతి నుండి ఎనిమిదవ తరగతి చదివే విద్యార్థులు (బాలురు) అడ్మిషన్ పొందవచ్చు అని పాఠశాల ప్రత్యేక అధికారి ఇమ్రాన్ బేగం ఒక ప్రకటనలో తెలిపారు, బాల కార్మికులు, మధ్యలో బడి మానేసిన విద్యార్థులకు, దారిద్ర రేఖకు దిగువన ఉన్న పేద కుటుంబాల విద్యార్థులకు ప్రవేశాలకు అర్హులుగా గుర్తించి అడ్మిషన్లు ప్రారంభించినట్లు తెలిపారు, పూర్తి వివరాలకు,పాఠశాల ప్రత్యేక అధికారిని సంప్రదించాలన్నారు,



## ప్రజా ప్రభుత్వం లో పరిహారాలు అందేనా?

భూ నిర్వాసితుడు బద్దం శంకర్ రెడ్డి

హుస్నాబాద్ మే24 ప్రజా తీర్పు

ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ మాకు పూర్తి పరిహారాలు ఎప్పుడు ఇస్తారని భూ నిర్వాసితుడు బద్దం శంకర్ రెడ్డి ప్రశ్నించారు. ఇంకా 50 ఎకరాల భూమి సేకరించి ఈ భూమికి మరియు అందులో ఉన్న బావులు, కట్టడాలకు పరిహారాలు ఇవ్వవలసి ఉంది. పెంపులో భాగంగా నిర్వాసితులైన గిరిజనులకు కొంతమందికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలు రాలేదు. రాష్ట్రంలోని మిగతా ప్రాజెక్టుల్లో గల భూ నిర్వాసితులకు అన్ని రకాల పరిహారాలు చెల్లించి సమస్యల్ని పరిష్కరిస్తుండగా మేమేం పాపం చేశామని గౌరవెల్లి ప్రాజెక్టు నిర్వాసితులు తమ ఆవేదనను బాధను వ్యక్తం చేస్తున్నారు. జడ్చర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే అయిన అనిరుద్ రెడ్డి, ఉదండాపూర్ నిర్వాసితులకు, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పరిధిలో ఉన్న చొక్కారావు దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పరిధిలోని నిర్వాసితులకు, మంథని ఎమ్మెల్యే మరియు మంత్రి అయిన శ్రీధర్ బాబు పరిధిలోని చిన్న కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ నిర్వాసితులకు, వనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తన నియోజకవర్గ పరిధిలోని ఘనపు సముద్రం రిజర్వాయర్ లోని నిర్వాసితులకు పరిహారాలు అందించిన విషయం నిజం కాదా అని ప్రశ్నించారు? ఈ నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు ప్రాజెక్టుల భూసేకరణ నిమిత్తం వందల ఎకరాల భూములకు మరియు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలు తదితర పరిహారాలన్నీ ఇప్పిస్తున్నారు కానీ హుస్నాబాద్ ఎమ్మెల్యే,మంత్రి అయిన పొన్నం ప్రభాకర్ తన పరిధిలో గల ఒకే ఒక్క ప్రాజెక్టు గౌరవెల్లి రిజర్వాయర్ లోని 50 ఎకరాల భూమికి ఎందుకు ఇప్పించలేకపోతున్నారని అన్నారు. ఈ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు అయింది. మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పే ప్రతి మీటింగ్ లో గౌరవెల్లి ప్రాజెక్టు ప్రస్తావన తీసుకు వస్తున్నారే గాని, పూర్తిగా ఇచ్చింది లేదు పరిహారాలు వచ్చింది లేదన్నారు. నిర్వాసితులకు ఇవ్వాల్సిన పరిహారాలు ఇచ్చి ప్రాజెక్టు పూర్తి చేయాలని నిర్వాసిత రైతులు గాని ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ,సీపీఐ లు కూడా ఎలాంటి ధర్నాలు, ఆందోళనలు చేయకపోవడం మంత్రికి కొంత ఇబ్బంది లేకుండా ఉందని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం వచ్చి మాకు ఏదో చేస్తుందని ఎన్ని ఇబ్బందులు ఎదురైనప్పటికీ కూడా ఓర్చుకున్నాం. ప్రభుత్వం ఏర్పడి సుమారు మూడు సంవత్సరాలు పూర్తి కావస్తున్నది. అయినా కూడా పూర్తి పరిహారాలపై స్పష్టత లేదు. ఇకనైనా గౌరవెల్లి ప్రాజెక్టు నిర్వాసితులకు ఇవ్వవలసిన భూములు, కట్టడాల పరిహారాలు, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలు ఇప్పించి ప్రాజెక్టు పూర్తి చేయాలని గుడాటిపల్లి నిర్వాసితుల తరఫున బద్ధం శంకర్ రెడ్డి డిమాండ్ చేశారు.



## వడదెబ్బతో కార్మికురాలి మృతి..

- అధికారుల నిర్లక్ష్యమే కారణం
- కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి
- మల్లమ్మ కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం ఇవ్వాలి
- డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ డిమాండ్

గోదావరిఖని, మే 24,( ప్రజా తీర్పు):

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో పారిశుద్ధ్య కాంట్రాక్ట్ కార్మికురాలు గాజనవేన మల్లమ్మ వడదెబ్బతో మృతి చెందడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట అని సమతా సైనిక దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ మండిపడ్డారు. మండుటెండల్లో కనీస రక్షణ చర్యలు లేకుండా కార్మికులతో పనులు చేయించడం అమానుషమని విమర్శించారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 21న విధులు నిర్వహిస్తున్న సమయంలో మల్లమ్మ తీవ్ర ఎండలతో పని ప్రదేశంలోనే మూర్చపోయిందన్నారు. అయితే అధికారులు, సిబ్బంది ఎవరూ గమనించకపోవడం దారుణమన్నారు. ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించక పోలీసులకు ఫిర్యాదు చేశారని, అనంతరం మల్లమ్మ మృతదేహం లభించడం కలచివేసే ఘటన అని పేర్కొన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా పనివేళల్లో మార్పులు చేయాలని, కార్మికులకు రక్షణ సామగ్రి, తాగునీరు, విశ్రాంతి సౌకర్యాలు కల్పించాలని కార్మిక సంఘాలు పలుమార్లు విజ్ఞప్తి చేసినా మున్సిపల్ అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. చీపుర్లు, గ్లౌజులు, మాస్కులు, గంపలు, తట్టలు వంటి కనీస సదుపాయాలు కూడా ఇవ్వకుండా కార్మికులతో పనులు చేయించడం దుర్మార్గమన్నారు. మున్సిపల్ కమిషనర్ అరుణశ్రీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి కార్మికులపై వేధింపులు పెరిగాయని, విధుల నుంచి తొలగింపులు, ఇష్టారాజ్యంగా పనివేళల మార్పులు చేస్తున్నారని విమర్శించారు. కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే మల్లమ్మ ప్రాణాలు కోల్పోయిందన్నారు. మల్లమ్మ మృతికి బాధ్యులైన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, కుటుంబానికి రూ.20 లక్షల నష్టపరిహారం అందించాలని, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ డిమాండ్ చేశారు. అలాగే మండుటెండల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

## పంట అవశేషాల దహనంపై రైతుల్లో చైతన్యం తీసుకురావాలి

- సన్‌ఫ్లవర్ కొనుగోళ్లకు వెంటనే చర్యలు చేపట్టాలి.
- గంటల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో ధాన్యం చెల్లింపులు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

(దుర్గం నగేష్, ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), మే 24 :



పంట అవశేషాల దహనంపై గ్రామీణ స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. రైతులు పంట అవశేషాలను కాల్చకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆదివారం ధాన్యం కొనుగోళ్లపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం కలెక్టరేట్ నుంచి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, హైదరాబాద్ నుంచి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు. పెద్దపల్లి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ యాసంగి–2026 ధాన్యం కొనుగోళ్లను సవాళ్ల మధ్య సమర్థవంతంగా నిర్వహిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి అభినందనలు తెలిపారు. భారీ స్థాయిలో వరి దిగుబడి వచ్చినప్పటికీ కొనుగోళ్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. మంత్రివర్గం ఇటీవల సన్‌ఫ్లవర్ పంట కొనుగోలుకు ఆమోదం తెలిపిందని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పెద్దపల్లి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సజావుగా కొనసాగుతున్నాయని, అధికారులు సమర్థంగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. రైతులకు కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించిన ఆయన, గతంలో ధాన్యం చెల్లింపులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండేవని, ప్రస్తుతం గంటల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో నగదు జమవుతోందని తెలిపారు. పంట అవశేషాల దహనం వల్ల వాయు కాలుష్యం పెరగడంతో పాటు అగ్నిప్రమాదాల ముప్పు ఉంటుందని పేర్కొన్న డిప్యూటీ సీఎం, ప్రతి గ్రామంలో టామ్‌టామ్ ద్వారా 15 నుంచి 30 రోజుల పాటు ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అవగాహన కార్యక్రమాల అనంతరం కూడా పంట అవశేషాలను కాల్చితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రైతులకు స్పష్టం చేయాలని సూచించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ మే చివరి నాటికి ధాన్యం కొనుగోళ్లు 100 శాతం పూర్తయ్యేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హమాలీలు, రవాణా సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అవసరమైన ఖర్చులను పౌరసరఫరాల శాఖ రీయింబర్స్‌మెంట్ చేస్తుందని తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సన్‌ఫ్లవర్ కొనుగోలుకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని, రైతుల వద్ద చివరి గింజ వరకు కొనుగోలు జరిగేలా చూడాలని అన్నారు. వరి కొయ్యలను కాల్చకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కాళిందిని, జిల్లా సహకార అధికారి శ్రీమాల, పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, జిల్లా మేనేజర్ పాల్గొన్నారు.

# ఉపాధి హామీకి - ?వడదెబ్బ

### కూలీలకు రక్షణ ఎక్కడ..?

**(జక్కుల రాంబాబు, ప్రజా తీర్పు, భద్రాద్రి కొత్తగూడెం రూరల్) మే 25,**

ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఉపాధి హామీ కూలీలు వడదెబ్బకు గురైన ఘటనలు కూడా అశ్వారావుపేట మండలంలో చోటుచేసుకుంటున్నాయి. ఎండల తీవ్రతకు వడదెబ్బతో తొలుత కొంత అస్వస్థతకు గురై ఆ తరువాత పరిస్థితులు విషమిస్తున్న ఘటనలున్నాయి. ఉపాధి హామీ పనుల ప్రాంతంలో ఎండల నుంచి రక్షణకు ఎలాంటి వసతులు లేకపోవటం వడదెబ్బకు ప్రధాన కారణమవుతోంది. పనిచేసిన తరువాత కొద్దిసేపు విశ్రాంతి తీసుకునేందుకు టెంట్లు లేకపోవటం, తాగునీరు ఏర్పాటు చేయకపోవటం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో లేకపోవటంతో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయని అశ్వారావుపేట ఉపాధి హామీ కూలీలు తెలుపుతున్నారు.ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటుతున్న తరుణంలో కూడా వసతులపై ఈజీఎస్ అధికారులు దృష్టి పెట్టకపోవటం విమర్శలకు తావిస్తోంది.



**ఫోటోతో అవస్థలు**

ఉపాధి హామీ పనుల నిర్వహణలో మార్పులు చోటుచేసుకోవడంతో కూలీలను రెండుసార్లు పనిప్రాంతంలో ఫోటోలు తీయాల్సి వస్తోంది. పనులు ప్రారంభించేటప్పుడు పనిప్రాంతంలో కూలీలను తొలుత ఫోటో తీయాలి. పని పూర్తయి ఇంటికి వెళ్లేటప్పుడు మళ్లీ ఫోటో తీయాలి. రెండు ఫోటోలు తీసేందుకు మధ్య కనీసం 4 గంటల వ్యవధి ఉండాలి. రెండు ఫోటోలు తీసిన తరువాత ఆ ఫోటోలను ఎన్ఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తేనే కూలీలకు వేతనాలు అందుతాయి. లేకుంటే పనిచేసిన వేతనాలు అందవు. ఎండల తీవ్రత కారణంగా తెల్లవారుజామున 5 గంటల నుంచే కూలీలు పనులకు వెళ్లాల్సి ఉంటుంది. ఇంటి నుంచి పనిప్రాంతానికి వెళ్లే సరికి ఉదయం 6 గంటలవుతోంది. అప్పటినుంచి నాలుగు గంటల పాటు పనిచేస్తేనే రెండవసారి ఫోటో తీసుకునేందుకు అనుమతులుంటాయి. కూలీలు ఎంత తొందరగా పనులకు వెళ్లినా ఉదయం 10 గంటల తరువాతనే రెండో సారి ఫోటో తీసుకునే అవకాశాలుంటాయి. మూడురోజులుగా ఎండల తీవ్రత మరీ ఎక్కువైంది. ఉదయం 8 గంటల నుంచే భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. మండుటెండల్లో కూలీలు రెండుగంటల పాటు పనులు చేయటంతో వడదెబ్బకు గురవుతున్నారు. పనిప్రాంతం నుంచి నడుచుకుంటూ ఇంటికి వచ్చే సరికి 11.30 అవుతోంది. కూలీలు ఇంటి నుంచి తీసుకెళ్లిన తాగునీరు వేడెక్కడంతో తాగలేకపోతున్నారు. వేడెక్కిన నీళ్లు తాగి కొందరు అస్వస్థతకు గురవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రెండు ఫోటోలు తీసే మధ్యలో వ్యవధిని తగ్గించాలని కూలీలు కోరుతున్నారు. పనిప్రాంతంలో టెంట్లు, చల్లటి తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని కూలీలు డిమాండ్ చేస్తున్నారు.




## గోల్డ్ అండ్ షేక్ హ్యాండ్ పెట్టుకున్న సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు సింగరేణి ఏరియా హాస్పిటల్ లలో వైద్య సౌకర్యాలు కల్పించాలి

- సింగరేణి యాజమాన్యనికి విశ్రాంత ఉద్యోగుల సంఘం డిమాండ్.

**(దండే భూమన్న ప్రజా తీర్పు మంచిర్యాల జిల్లా ప్రతినిధి) మే 24**

మంచిర్యాల జిల్లా కేంద్రంలో సింగరేణి కంపెనీ లో 25-27 సంవత్సరాలు తమ రక్తాన్ని చమటగా మార్చి మృత్యు గృహాలాంటి బొగ్గు గనుల్లో తమ ప్రాణాలను పణంగా పెట్టి సింగరేణి అభివృద్ధికి , పురోభివృద్ధికి బాటలు వేసిన గత సీమాంధ్ర ప్రభుత్వం లో తప్పనిసరి పరిస్థితుల్లో గోల్డ్ అండ్ షేక్ హ్యాండ్ పథకం కింద పదవి విరమణ చేసిన సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు ఆయా ఏరియా హాస్పిటల్ లో బీపీ , షుగర్, మోకాల్ల , ఖిల్లా నొప్పులు మరియు దీర్ఘకాలీక వ్యాధులు అయినటువంటి గుండె , లివర్ , కిడ్నీ తదితర వ్యాధుల బారిన పడిన గోల్డ్ అండ్ షేక్ హ్యాండ్ విశ్రాంత ఉద్యోగులకు సింగరేణి లోని ఆయా ఏరియా హాస్పిటలలో వైద్య సౌకర్యాలు అందించాలని ఈరోజు మంచిర్యాల జిల్లా కేంద్రం లో జరిగిన సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం సమావేశం సింగరేణి యాజమాన్యన్ని డిమాండ్ చేసినది. అదే విధంగా గోల్డ్ అండ్ షేక్ హ్యాండ్ పథకం కింద పదవి విరమణ చేసిన ఉద్యోగులకు 350 నుండి 1000 రూపాయిల లోపు గా అతి తక్కువ కోల్ మైన్స్ పెన్షన్ పొందుతున్నారని, గోల్డ్ అండ్ షేక్ పెట్టుకున్న కుటుంబాలు కడుదీనంగా ఉన్నాయని గోల్డ్ అండ్ షేక్ హ్యాండ్ పథకం పెట్టుకున్న కొందరు ఉద్యోగులు రోజు కూలీ లుగా , అడ్డ కూలీలుగా , హోటల్ లో వర్కర్లు గా పని చేస్తూ వాళ్ళ కుటుంబాలను పోషించుకోలేక ఏవైనా రోగాలు నొప్పులు వస్తే బజార్ లో ఉన్న కార్పొరేట్ హాస్పిటల్స్ కు వెళ్లలేక ఎందరో ఉద్యోగులు సింగరేణి లో తనువు చాలించిన సందర్భాలు ఉన్నాయని ఈ సమావేశం లో ఆవేదన వెలబుచ్చారు. సింగరేణి యాజమాన్యం,మన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రివర్యులు వివేక్ వెంకట స్వామి మరియు నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన సి అండ్ ఎం డి బుద్ధ ప్రకాష్ జ్యోతి , గుర్తింపు ప్రాతునిధ్య కార్మిక సంఘాలు , గోల్డ్ అండ్ షేక్ హ్యాండ్ ఉద్యోగుల పట్ల మానవతా దృష్టి తో ఆలోచించి వీరికి ఆయా సింగరేణి ఏరియా హాస్పిటల్ లలో గోల్డ్ అండ్ షేక్ హ్యాండ్ ఉద్యోగులకు వైద్య సౌకర్యాలు అందించే విధంగా కృషి చేయాలని ఈ సమావేశం డిమాండ్ చేసింది. అదే విధంగా హైదరాబాద్ , వరంగల్ , కరీంనగర్ , నిజామాబాద్ తదితర ప్రాంతాలలో నివసిస్తున్న సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు ఏరియా హాస్పిటల్ లలో 2 నెలలకు సరిపడా మందు గోలీలు ఇవ్వాలని సింగరేణి యాజమాన్యాని , చీఫ్ మెడికల్ ఆఫీసర్ ను ఈ సమావేశం కోరినాది. ఈ సమావేశంలో మంచిర్యాల జిల్లా సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం , తెలంగాణ ఉద్యమ కారుల ఐక్య వేదిక అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య , ఉపాధ్యక్షులు భీమ్ సేన్ , కార్యదర్శి రాజేశం , నాయకులు భిక్షపతి , సదానందం , చారి , నారాయణ , అంజన్న , పోషం తదితరులు పాల్గొన్నారు.

# కుల ఈర్ష్యను తరిమి కొడితేనే ఏదైనా సాధ్యం

**(కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్) మే 24**



జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండల కేంద్రంలో సామాజిక సేవా కార్యకర్తలు శాతల్ల లక్ష్మణ్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న "డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నామస్మరణ" కార్యక్రమం నిర్వహించారు. ?ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మాల మహానాడు గొల్లపెల్లి మండల అధ్యక్షుడు పొనగంటి రాజరత్నం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ వారు మాట్లాడుతూ ఈ దేశం అభివృద్ధి చెందకపోవడానికి ప్రధానమైన ముఖ్యకారణం ఇదే నిచ్చెనమెట్ల కుల వ్యవస్థలో కింద కులపోడు ఎంత మంచి పనిచేసిన , ఎంత గొప్ప పనిచేసిన ,అది కేవలం దేశకోసం,దేశంలోని అణచివేయబడిన ప్రజలకోసం చేసిన ఆ ప్రజలకే నచ్చదు, వాడికి ఎంత జ్ఞానం ఉన్న వాడికంటే పై కులం వాళ్ళ ఆదరించరు అభినందించరు. అందుకే అంబేద్కర్ 100 ఏళ్ల ముందే చెప్పారు ఈ దేశం నుండి కులాన్ని, మనుషుల్లో ఉన్న ఈర్ష్యను తరిమి కొడితేనే ఏదైనా సాధ్యం అన్ని గోనియాడారు. ప్రతి ఆదివారం అంబేద్కర్ నామస్మరణ కార్యక్రమం ద్వారా ప్రజల్లో చైతన్యం నింపుతున్న నిర్వాహకులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎనగదుల రమేష్, కొండ్రా రాజయ్య, తో పాటు పలువురు అంబేద్కర్ వాదులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కల్వచర్ల స్మశాన వాటికకు విద్యుత్ సౌకర్యం కల్పింపు

**రామగిరి, మే-24(ప్రజాతీర్పు)**



రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలోని రాళ్లమాటు వద్ద ఉన్న స్మశాన వాటికకు విద్యుత్ సౌకర్యం కల్పించే దిశగా ఏకదశ విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమం సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ విద్యుత్ సౌకర్యం ద్వారా స్మశాన వాటికలో అవసరమైన సమయంలో మెరుగైన సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. ముఖ్యంగా స్మశాన వాటిక పరిసరాల్లో విద్యుద్దీపాల ఏర్పాటు, అంత్యక్రియల అనంతరం స్నానాల కోసం షవర్ సదుపాయాల ఏర్పాటు వంటి పనులు చేపట్టేందుకు అవకాశం కలగనుంది. దీంతో గ్రామ ప్రజలకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం ఏర్పడనుంది. స్మశాన వాటికకు విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయడంలో సహకరించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మంథని డివిజన్ విద్యుత్ శాఖ సహాయ డివిజనల్ ఇంజనీర్ వెంకటరమణ, సహాయ ఇంజనీర్ మహేందర్ రెడ్డి, విద్యుత్ శాఖ సిబ్బంది మౌలానా, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్మెన్ ఆకుల శ్రీనివాస్‌లకు సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రజోపయోగ కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది మరియు సహకరించిన ప్రతి ఒక్కరికి గ్రామపంచాయితీ తరపున అభినందనలు తెలియజేశారు. గ్రామాభివృద్ధికి దోహదపడే ఇలాంటి కార్యక్రమాలు మరింత ముందుకు సాగాలని గ్రామస్థులు ఆకాంక్షించారు.

# గౌడ సంఘం నూతన అధ్యక్షులు గా కాసారపు ప్రవీణ్ గౌడ్

**(కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్) మే 24**



జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలం రాఘవపట్నం గౌడ సంఘం నూతన అధ్యక్షులు గా కాసారపు ప్రవీణ్ గౌడ్ ఉపాధ్యక్షులు గా కాసారపు తిరుతి గౌడ్ ఎన్నికైనారు.కార్యవర్గ సభ్యులుగా కాసారపు శంకరయ్య గౌడ్, బుర్ర నరేష్ గౌడ్,పొన్నం రాజన్న గౌడ్, బుర్ర వెంకటేష్ గౌడ్, బుర్ర జనార్ధన్ గౌడ్ బుర్ర దేవేందర్ గౌడ్ ఎన్నికైనారు. ఈ సందర్భంగా అధ్యక్షులు గా ఎన్నికైన కాసారపు ప్రవీణ్ గౌడ్ మాట్లాడుతూ నా పైన నమ్మకంతో గౌడ సంఘం అధ్యక్షులు గా పదవి బాధ్యత లు అప్పగిసున్న తోటి గౌడ పెద్దలకు సంఘం సభ్యులకు యువత కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు గౌడ సంఘం అభివృద్ధి హక్కులకు కృషి చేసానని హామీ ఇచ్చారు.ఇట్టి కార్యక్రమంలో రాఘువపట్నం గ్రామ సర్పంచ్ శ్రీ కాసారపు భవాని అరవింద్ గౌడ్, మాజీ సర్పంచ్ బుర్ర తిరుపతి గౌడ్, మాజీ ఎంపీటీసీ బుర్ర రాజేందర్ గౌడ్,మెరుగు రవి,గొల్లపెల్లి సత్యం గౌడ్,బుర్ర ఆంజనేయులు గౌడ్, బుర్ర మొండయ్య గౌడ్, కాసరపు శ్రీను, కాసరపు అశోక్ పాల్గొన్నారు.

## రేపు సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

### ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్

**(కపిల్ వాగ్మరే సిఆర్ కే,ప్రజా తీర్పు బైంసా) మే 24**



రేపు అనగా25 వ తేది సోమవారం నుండి నియోజకవర్గంలో సన్ ఫ్లవర్ పొద్దు తిరుగుడు పంట కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్,తెలియజేశారు.ముధోల్ మండల కేంద్రం తో పాటు మండలంలోని బోరిగాం, కుంటాల మండలంలోని లింబా( కె ) గ్రామాల్లో కేంద్రాలు, ప్రారంభమవుతాయని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జొన్న కొనుగోలు కేంద్రాలు రేపు ప్రారంభించనున్నట్లు చెప్పారు. గతంలో ఎప్పుడు లేని విధంగా కొనుగోలు కేంద్రాలు, వాటికి అనుబంధంగా సబ్ సెంటర్లు చేసామన్నారు.లారీల కొరత, గన్ని సంచుల కొరత,పంట నిల్వలకు స్థలం లేక ఇబ్బందులు ఉన్నప్పటికీ, అన్నిటిని అధిగమించి, ఈసారి ప్రభుత్వ కేంద్రాల ద్వారా పెద్ద మొత్తంలో పంట కొనుగోలు చేపట్టడం జరిగిందన్నారు. కొంత జాప్యం జరిగినప్పటికీ, రైతులు తమ పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మి మద్దతుధర పొందాలని చెప్పారు.



## డివివో గా పదోన్నతి పొందిన శ్రీనివాస్ గౌడ్ కు ఘన సన్మానం

**(వెగ్గళం రాధాకిషన్ ప్రజాతీర్పు ఇల్లంతకుంట )మే 25**

ఇల్లంతకుంట మండలంలో గతంలో ఎంపిడిఓ గా విధులు నిర్వర్తించిన గున్నాల శ్రీనివాస్ గౌడ్ డివివో గా సిద్దిపేట జిల్లా విజిలెన్స్ అధికారిగా పదోన్నతి పొందిన సందర్భంగా ఆదివారం వల్లంపట్ల గౌడ సంఘం ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక సిడిపివో నాయిని ఎల్లయ్య, మండల గౌడ సంఘం అధ్యక్షుడు గజ్జెల రాజశేఖర్ గౌడ్,సర్పంచ్ నేరెళ్ల విజయ్ గౌడ్,మాజీ సర్పంచ్ మేకల శ్రీనివాస్ యాదవ్,కట్ట నర్సింహా రెడ్డి,నాయిని ధర్మయ్య, నాయిని రమేష్, నేరెళ్ల శ్రీనివాస్,నాయిని మల్లేశం, పులి మల్లేశం,కీసరి రవి,నేరెళ్ల రాజు కాసారపు పర్శరాములు, నాయిని మహేందర్ తదితరులు పాల్గొన్నారు.




# పెట్టుబడికి దారేది

### మోదీ సర్కార్ నిర్ణయాలతో గోల్డ్ ఇన్వెస్టర్లలో గుబులు

కనీసం ఏడాదిపాటు దేశ ప్రజ లు బంగారం కొనుగోళ్లకు దూరంగా ఉండాలని ఇటీవల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే విదేశాల నుంచి దేశంలోకి వచ్చే పసిడి, వెండి దిగుమతులపై వసూలు చేసే కస్టమ్స్ సుంకం, సెస్సును గరిష్ఠంగా 15 శాతానికి పెంచిన సంగతీ విదితమే. అంతేగాక దిగుమతులపైనా పరిమితుల్ని విధించి నగల ఎగుమతిదారులకు షాకిచ్చారు. దీంతో పుత్తడిపై పెట్టుబడులు పెట్టినవారిలో ఒక్కసారిగా గుబులు మొదలైంది. ఇకపై పెట్టాలనుకునేవారూ అయోమయంలో పడ్డారు. మరి మార్కెట్ నిపుణుల మాటేంటి?

**ఇదీ సంగతి..**

కేంద్ర ప్రభుత్వం ఈ నెల 13న బంగారం, వెండిపై దిగుమతి సుంకాన్ని 6 శాతం నుంచి 15 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. ఈ దెబ్బకు మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా (ఎంసీఎక్స్)తోపాటు ప్రముఖ జ్యుయెల్లరీ షోరూంలలో ధరలు భారీగా పెరిగాయి. ఢిల్లీ స్పాట్ మార్కెట్‌లోనూ 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల పుత్తడి రేటు ఈ ఒక్కరోజే రూ.8,550 ఎగిసి రూ.1,65,350గా నమోదైంది. మరోవైపు కిలో వెండి ధర రూ.20,500 ఎగబాకి రూ.2,97,500కు చేరింది.

# మాజీ మంత్రి ప్రొద్దుటూరీ నరసారెడ్డి విగ్రహావిష్కరణ

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ శాసనసభ్యులు గడ్డిగారి విట్టల్ రెడ్డి

**(కపిల్ వాగ్మారే సిఆర్ కే,ప్రజా తీర్పు బైంసా ) మే 24**





ఈ రోజు నిర్మల్ జిల్లా కేంద్రం లో మాజీ మంత్రి వర్యులు స్వర్గీయ ప్రొద్దుటూరు నర్సారెడ్డి,(నర్సన్న బాపు) విగ్రహఆవిష్కరణ కార్యక్రమం ఎంతో ఘనంగా జరిగింది. ముఖ్య అతిధి గ పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదరులు పెద్దలు గౌరవనీయులు సుదర్శన్ రెడ్డి, మరియు తెలంగాణ రాష్ట్రం బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదరు పెద్దలు గౌరవనీయులు,వి. హనుమంత్ రావు,మరియు మాజీ మంత్రి వర్యులు అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ మంత్రి వర్యులు వేణుగోపాల్ చారీ,మాజీ శాసనసభ్యులు గడ్డి గారి విఠల్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి సభ అధ్యక్షులు హరి రావు,ఉర్దూ అకాడమీ చైర్మన్ తహెర్ బిన్ హంధన్గారు, కల్లు గీత పరిశ్రమీకా సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్ గౌడ్,గ్రంథాలయ చైర్మన్అంజుమన్ అలీ, మున్సిపల్ చైర్మన్ అప్పల కావ్య గణేష్, ఏఎంసి చైర్మన్ ఆనంద్ రావు పటిల్ ఏఎంసి వైస్ చైర్మన్ ఎండి ఫరూక్, అహ్మద్,మాజీ జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ రాజన్న గారు మరియు జిల్లా నాయకులు మండల నాయకులు తదితరులు ఉన్నారు.




## ఏయే వ్యాధులు ఉన్నవారు ఏయే మిల్లెట్స్‌ను తింటే ఫలితం ఉంటుంది..?

ప్రస్తుతం చాలా మందికి ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెరిగింది. అందుకనే ఆరోగ్యంగా ఉండడం కోసం అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. వ్యాయామం చేయడంతోపాటు ఆహారం విషయంలోనూ అనేక మార్పులు చేసుకుంటున్నారు. అందులో భాగంగానే ఒకప్పుడు మన పూర్వీకులు తిన్న చిరు ధాన్యాలను ఇప్పుడు చాలా మంది తినేందుకు ఆసక్తిని చూపిస్తున్నారు. చిరు ధాన్యాలనే సిరి ధాన్యాలు, మిల్లెట్స్ అని కూడా పిలుస్తారు. ప్రస్తుతం చాలా మంది వీటిని తింటున్నారు. మిల్లెట్స్‌ను తినడం వల్ల అనేక లాభాలు కలుగుతాయి. అనేక వ్యాధులను నయం చేసుకోవచ్చు. అందుకనే చాలా మంది తమ రోజు వారి ఆహారంలో మిల్లెట్స్‌ను భాగం చేసుకుంటున్నారు. మిల్లెట్స్‌లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది అనేక వ్యాధులను తగ్గించేందుకు సహాయం చేస్తుంది. అయితే మిల్లెట్స్‌లో అనేక రకాలు ఉంటాయి. మనకు ఉన్న భిన్న రకాల వ్యాధులను బట్టి భిన్నమైన మిల్లెట్స్‌ను తినాల్సి ఉంటుంది. అప్పుడే ఆశించిన స్థాయిలో ఫలితం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.



## పాలకూర జ్యూస్‌ను తాగుతున్నారా..? అయితే ఈ జాగ్రత్తలను పాటించాల్సిందే..!

పాలకూర మనకు ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉంటుంది. పాలకూరతో చేసే వంటలను అందరూ ఎంతో ఇష్టంగా తింటారు. దీంతో అనేక కూరలు, ఇతర వంటకాలను చేయవచ్చు. ఆరోగ్యంగా ఉండాలంటే పాలకూరను తరచూ తినాలని పోషకాహార నిపుణులు కూడా చెబుతుంటారు. పాలకూరలో మన శరీరానికి కావల్సిన అనేక పోషకాలు ఉంటాయి. దీన్ని పోషకాలకు నెలవుగా అభివర్ణిస్తుంటారు. పాలకూరను రోజూ తినడం కన్నా జ్యూస్ చేసి తాగితే మేలు అని చాలా మంది బావిస్తుంటారు. ఉదయం పరగడుపునే దీని జ్యూస్‌ను తాగుతుంటారు కూడా. అయితే పాలకూర జ్యూస్‌ను రోజూ తాగే వారు కొన్ని జాగ్రత్తలను తప్పక పాటించాలని, లేకపోతే లాభం కలగకపోగా నష్టం కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు.



## కిడ్నీలకు గండాలు దీర్ఘకాలపు మందులు

మానవ శరీర ప్రధాన వ్యవస్థల్లో మూత్రపిండాలు ఒకటి. రక్తాన్ని శుద్ధి చేయడంలో, రక్తపోటును నియంత్రించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. రక్తపోటు, మధుమేహం నియంత్రణలో లేకపోతే కిడ్నీలు ప్రమాదంలో పడినట్టే. కాబట్టి, బీపీ, షుగర్ ఉన్నవారు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, జీవితకాలం మందులు వాడేవారు, పెయిన్ కిల్లర్స్, యాంటిబయాటిక్స్‌కు అలవాటుపడిన వారు.. తరచూ మూత్రపిండాల పనితీరును పరీక్షించుకోవాలి. అందులోనూ, ఈ మధ్యకాలంలో కిడ్నీ వ్యాధులు పెరిగిపోతున్నాయి. డయాలసిస్ రోగుల సంఖ్య కూడా అధికం అవుతున్నది. మనదేశంలో 18 శాతానికి పైగా జనాభాకు ఏదో ఒక రకం కిడ్నీ జబ్బులు ఉన్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. ఇక పెయిన్ కిల్లర్స్, యాంటిబయాటిక్స్ కూడా మూత్రపిండ వ్యాధులకు దారితీస్తున్నాయి. అందువల్ల, ఈ తరహా ఔషధాలు అనివార్య మైనప్పుడు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా మూత్రపిండ వ్యాధులకు అడ్డుకట్ట వేయవచ్చు.



# రక్తంలో ప్లేట్‌లెట్స్ వేగంగా పెంచే పండు ఏదో తెలుసా?





**రక్తంలో తక్కువ ప్లేట్‌లెట్లు ఉండటం చాలా ప్రమాదకరం. ఎందుకంటే ఇవి రక్తం గడ్డకట్టే సామర్థ్యాన్ని దెబ్బతీస్తాయి. రక్తంలో ప్లేట్‌లెట్లు తక్కువగా ఉండటానికి అనేక కారణాలు ఉండవచ్చు. అయితే ప్లేట్‌లెట్లను పెంచడానికి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం. డెంగ్యూ బారిన పడిన వారిలో..**

రక్తంలో ప్లేట్‌లెట్స్ వేగంగా పెంచే పండు ఏదో తెలుసా? ప్లేట్‌లెట్లు.. రక్తం గడ్డకట్టడానికి, రక్తస్రావం ఆపడానికి, గాయాలు వేగంగా మానడానికి సహాయపడతాయి. రక్తంలో తక్కువ ప్లేట్‌లెట్లు ఉండటం చాలా ప్రమాదకరం. ఎందుకంటే ఇవి రక్తం గడ్డకట్టే సామర్థ్యాన్ని దెబ్బతీస్తాయి. రక్తంలో ప్లేట్‌లెట్లు తక్కువగా ఉండటానికి అనేక కారణాలు ఉండవచ్చు. అయితే ప్లేట్‌లెట్లను పెంచడానికి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం. డెంగ్యూ బారిన పడిన వారిలో ఈ సమస్య సర్వసాధారణం. డెంగ్యూ రోగుల్లో ప్లేట్‌లెట్లు అకస్మాత్తుగా తగ్గుతాయి. ఇది రోగికి ప్రాణాంతకం కావచ్చు. ఈ సమస్యను మందులతో తాత్కాలికంగా తగ్గించగలిగినప్పటికీ.. దీర్ఘకాలిక శ్రేయస్సు కోసం సరైన ఆహారం తీసుకోవడం చాలా అవసరం. ఈ సమయంలో కొన్ని ఆహారాలు తీసుకోవాలి. కొందరు ఈ టైంలో బొప్పాయి తినాలని అంటుంటారు. మరికొందరు కివి రక్తంలో ప్లేట్‌లెట్ స్థాయిలను నిర్వహించడానికి సహాయపడుతుందని అంటుంటారు. కానీ ఏది వాస్తవానికి ప్రభావవంతంగా ఉంటుందో ఇక్కడ తెలుసుకుందాం.. విటమిన్ సి

### కివిజి

ఇందులో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. కొల్లాజెన్‌ను ఉత్పత్తి చేయడం ద్వారా రక్త నాళాల బలాన్ని కాపాడుతుంది. కివిలో ఫోలేట్ ఉంటుంది. ఇది ఎర్ర రక్త కణాలు, ప్లేట్‌లెట్ల ఉత్పత్తికి సహాయపడుతుంది. రక్తం ఏర్పడటంలో ఫోలేట్ పాత్ర చాలా కీలకం. కివిలో పాలీఫెనాల్స్, కెరోటినాయిడ్స్ వంటి యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ప్లేట్‌లెట్లను ఆక్సీకరణ ఒత్తిడి నుండి రక్షిస్తాయి. కివి జీర్ణక్రియకు సహాయపడుతుంది. జీర్ణక్రియ, పోషకాల శోషణకు సహాయపడే ఆక్టినిడిన్ ఎంజైమ్‌లను కలిగి ఉంటుంది. తద్వారా రక్త ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపుతుంది. కివి తినడం వల్ల జ్వరం తర్వాత కోలుకోవడానికి సహాయపడే పొటాషియం, ఫైబర్‌ను అందిస్తుంది. ఇందులో నీరు, ఎలక్ట్రోలైట్లు అధికంగా ఉంటాయి. కివి వాపును తగ్గిస్తుంది. ఇది ఎముక మజ్జ బాగా పనిచేయడానికి, ప్లేట్‌లెట్లను ఉత్పత్తి చేయడానికి సహాయపడుతుంది.

### బొప్పాయిజి

బొప్పాయిలో విటమిన్ సి కూడా సమృద్ధిగా ఉంటుంది. కానీ కివి కంటే కొంచెం తక్కువ. డెంగ్యూ సమయంలో ప్లేట్‌లెట్లను పెంచడంలో బొప్పాయి ఆకుల రసం ప్రభావవంతంగా ఉంటుంది. బొప్పాయిలో బీటా-కెరోటిన్, ఫ్లేవనాయిడ్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఇన్ఫెక్షన్ల నుంచి వేగంగా కోలుకోవడానికి సహాయపడతాయి. బొప్పాయిలోని పపైన్ ఎంజైమ్ జీర్ణక్రియను సులభతరం చేస్తుంది, తద్వారా శరీరం పోషకాలను సరిగ్గా ఉపయోగించుకుంటుంది. ప్లేట్‌లెట్లను పెంచుతుంది. బొప్పాయిలో నీటి శాతం అధికంగా ఉంటుంది. ఇది నిర్జలీకరణాన్ని నివారిస్తుంది. మొత్తం కణ ఆరోగ్యానికి సహాయపడుతుంది. బొప్పాయిలోని కైమోపాపైన్, పపైన్ అనే పదార్థాలు మంటను తగ్గిస్తాయి.



# ఆకులతో ఆరోగ్యం!



**ఆకులతో ఆరోగ్యం! ఆయుర్వేదంలో 'నేరేడు'ది ప్రత్యేక స్థానం. దీని పండ్లు మాత్రమే కాదు.. ఆకులు కూడా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలిగిస్తాయని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు. అనేక ఔషధ గుణాలతో నిండిన నేరేడు ఆకులు.. వివిధ వ్యాధులను నివారించడంలో సమర్థంగా పనిచేస్తాయని చెబుతున్నారు.**

ఆయుర్వేదంలో 'నేరేడు'ది ప్రత్యేక స్థానం. దీని పండ్లు మాత్రమే కాదు.. ఆకులు కూడా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలిగిస్తాయని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు. అనేక ఔషధ గుణాలతో నిండిన నేరేడు ఆకులు.. వివిధ వ్యాధులను నివారించడంలో సమర్థంగా పనిచేస్తాయని చెబుతున్నారు. నేరేడు ఆకులను నమలడం వల్ల నోటి ఆరోగ్యం మెరుగుపడుతుంది. నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. నోటి దుర్వాసన తగ్గుతుంది. దంతాలు, చిగుళ్లు ఆరోగ్యంగా మారుతాయి. వీటిలోని ఆయుర్వేద సమ్మేళనాలు.. జీర్ణవ్యవస్థ ఆరోగ్యానికి భరోసా ఇస్తాయి. నేరేడు ఆకుల కషాయం తాగితే.. విరేచనాలు ఇట్టే తగ్గిపోతాయి. కాలేయం పనితీరు కూడా మెరుగుపడుతుంది. కడుపు ఉబ్బరం, గ్యాస్, అజీర్తి వంటి సమస్యలూ తగ్గిపోతాయి. నేరేడు ఆకుల్లో యాంటి బ్యాక్టీరియల్, యాంటి ఇన్‌ఫ్లమేటరీ గుణాలు పుష్కలం. ఇవి రక్తంలో చక్కెర విడుదలను నియంత్రిస్తాయి. దాంతో, షుగర్ లెవల్స్ తగ్గుతాయి. అలా.. మధుమేహాన్ని నియంత్రణలో ఉంచుతాయి. భోజనానికి ముందు.. ఓ టీస్పూన్ నేరేడు ఆకుల రసాన్ని తీసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. నేరేడు ఆకుల రసంలో కొద్దిగా ధనియాలు వేసి తాగితే.. జ్వరం తగ్గిపోతుంది.

# చెరువు కట్టపైనే నల్లమట్టి టిప్పర్ల దూకుడు..

- కట్టను కాపాడేందుకు పెట్టిన బండల తొలగింపు..?
- నర్సింగరావు చెరువు భద్రతపై గ్రామస్తులు, మత్స్యకారుల ఆందోళన



**రామడుగు, మే 24 (ప్రజాతీర్పు ప్రతినిధి)**

రామడుగు మండలంలో కొనసాగుతున్న నల్లమట్టి రవాణా వివాదం రోజురోజుకూ కొత్త మలుపులు తిరుగుతోంది. ఇప్పటికే కోరటపల్లి రెవెన్యూ గ్రామ శివారులోని గోవిందరాజుల కుంట చెరువులో జరుగుతున్న నల్లమట్టి తవ్వకాలు, రవాణాపై స్థానికంగా తీవ్ర చర్చ కొనసాగుతుండగా, ఇప్పుడు రామడుగు గ్రామ పరిధిలోని నర్సింగరావు చెరువు కట్ట భద్రత అంశం కొత్త వివాదానికి దారితీసింది. స్థానికుల వివరాల ప్రకారం, గోవిందరాజుల కుంట చెరువులో నుంచి తరలిస్తున్న నల్లమట్టిని భారీ టిప్పర్ల ద్వారా రామడుగు గ్రామంలోని నర్సింగరావు చెరువు కట్ట మీదుగానే రవాణా చేస్తున్నట్లు తెలుస్తోంది. రోజంతా భారీ లోడుతో టిప్పర్లు కట్టపై నుంచి దూసుకుపోతుండటంతో చెరువు కట్ట బలహీనపడే ప్రమాదం ఉందని గ్రామస్తులు, మత్స్యకారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో చెరువు కట్టల భద్రత అత్యంత కీలకమని గ్రామ పెద్దలు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే కట్టలో కొన్ని ప్రాంతాల్లో నేల సడలడం, చిన్నపాటి పగుళ్లు కనిపిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. భారీ టిప్పర్ల నిరంతర రాకపోకల వల్ల భవిష్యత్తులో చెరువు కట్టకు గండి పడే ప్రమాదాన్ని కొట్టిపారేయలేమని పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా, ఇప్పటికే గోవిందరాజుల కుంట చెరువులో జరుగుతున్న నల్లమట్టి రవాణాపై అనుమతుల అమలు విషయంలో కూడా పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. స్థానికుల వాదన ప్రకారం, ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే రవాణాకు అనుమతులు ఉన్నప్పటికీ రాత్రి తెల్లవార్లూ టిప్పర్లు భారీ సంఖ్యలో తిరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. రోజుకు పరిమిత సంఖ్యలో వాహనాలకు మాత్రమే అనుమతులున్నాయా..? లేక 70 నుంచి 80 టిప్పర్ల వరకు మట్టి తరలింపులు జరుగుతున్నాయా..? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది స్థానికులు 10 వాహనాలకు మాత్రమే పరిమితి ఉందని చెబుతుండగా, వాస్తవానికి అంతకుమించిన స్థాయిలో రవాణా సాగుతోందని ఆరోపిస్తున్నారు. ఎమ్మార్వో కార్యాలయం సమీప ప్రాంతాల నుంచే టిప్పర్లు నిరంతరం రాకపోకలు సాగిస్తున్నప్పటికీ సంబంధిత శాఖల పర్యవేక్షణ కనిపించడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. నిన్న వెలువడిన కథనంపై ఇప్పటివరకు ఏ శాఖ స్పందించకపోవడం కూడా స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఇక చెరువు కట్టను కాపాడుకునేందుకు స్థానిక మత్స్యకారులు, రైతులు కలిసి కట్టపైకి వాహనాలు రాకుండా త్రోవకు అడ్డంగా పెద్ద బండలను ఏర్పాటు చేసినప్పటికీ, వాటిని పట్టించుకోకుండా చెరువు మధ్యభాగంలో నుంచి ప్రత్యామ్నాయ త్రోవ చేసుకొని టిప్పర్లు వెళ్లినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఇదే సమయంలో శనివారం రాత్రి రామడుగు పోచమ్మ కూడలి వద్ద జరిగిన ఘటన కూడా స్థానికుల్లో మరింత ఆందోళనకు దారితీసింది. స్థానికుల సమాచారం ప్రకారం, వేగంగా వెళ్తున్న ఓ మట్టి టిప్పర్ వరిధాన్యం లోడుతో వెళ్తున్న లారీ వెనుక భాగాన్ని ఢీకొనగా లారీ కొంతవరకు దెబ్బతినడంతో పాటు ధాన్యం బస్తాలు రోడ్డుపై జారిపడ్డాయి. ఘటన అనంతరం స్థానికులు టిప్పర్ డ్రైవర్‌ను ఆపి నిలదీయడానికి ప్రయత్నించినప్పటికీ, వాహనం ఆపకుండా వెళ్లిపోయినట్లు తెలిసింది. భారీ వాహనాల వేగవంతమైన రాకపోకలు గ్రామాల్లో ప్రమాదకర పరిస్థితులకు దారితీస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా, రాత్రివేళల్లో అడ్డంగా పెట్టిన బండలను తొలగించి మరీ తెల్లవారుజామున వరకు కట్టపైనుండి టిప్పర్లు తిరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. చెరువు కట్ట దెబ్బతింటే గ్రామానికి మాత్రమే కాదు, సాగునీటి వ్యవస్థకు, చేపల పెంపకానికి కూడా తీవ్ర నష్టం జరుగుతుందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువుపైనే ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు భయాందోళనలకు గురవుతున్నాయని తెలిపారు. మరోవైపు, చెరువు నీటిని ఆధారంగా చేసుకొని సాగు చేస్తున్న రైతులు కూడా ఇదే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తుల వాదన ప్రకారం, మట్టి రవాణాకు ఇతర ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నప్పటికీ, సమయం ఆదా కోసం చెరువు కట్టను వినియోగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. భారీ టిప్పర్ల ఒత్తిడి కారణంగా భవిష్యత్తులో చెరువు కట్ట మరమ్మతులకు ప్రభుత్వానికి భారీగా నిధులు ఖర్చయ్యే పరిస్థితి తలెత్తవచ్చని పేర్కొంటున్నారు. చెరువులు, చెరువు కట్టల రక్షణకు సంబంధించి ఇరిగేషన్ శాఖ సాంకేతిక మార్గదర్శకాలు, నీటినిల్వల భద్రత నిబంధనల ప్రకారం చెరువు కట్టలపై భారీ వాహనాల రాకపోకలు అనుమతించరాదని అధికారులు చెబుతున్నారు. గ్రామీణ నీటివనరుల సంరక్షణ బాధ్యత రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలపై ఉన్న నేపథ్యంలో సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. చెరువు కట్టల భద్రత విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే భవిష్యత్తులో పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశముందని హెచ్చరిస్తున్నారు. వెంటనే నర్సింగరావు చెరువు కట్టపై నుంచి భారీ వాహనాల రాకపోకలను నిలిపివేసి, ప్రత్యామ్నాయ మార్గాలను గుర్తించాలని గ్రామస్తులు, మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్ శాఖలు సంయుక్తంగా స్థల పరిశీలన నిర్వహించి చెరువు కట్ట భద్రతపై సాంకేతిక నివేదిక విడుదల చేయాలని కోరుతున్నారు.



## ముంబైపై ఘన విజయంతో ప్లే ఆఫ్స్‌కు రాజస్థాన్.. ఢిల్లీ, పంజాబ్, కోల్‌కతా ఇంటికి ..!

పంతొమ్మిదో సీజన్ ప్లే ఆఫ్స్ చివరి బెర్తును రాజస్థాన్ రాయల్స్(=ఖుయిుర్ష్ఘుఅ =శీఖుశ్రీం) పట్టేసింది. ఉత్కంఠ పోరులో అదిరే ఆటతో ముంబై ఇండియన్స్(వీబఎఖుఱ ×అసఱఖుఅం)కు చెక్ పెట్టిన రాజస్థాన్.. ఎలిమినేటర్ ఆడాలనుకున్న పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఇంటికి పంపింది. వాంఖడేలో జోఫ్రా ఆర్చర్(32, 3-17) ఆల్‌రౌండ్ షోతో ముంబై బెంబేలెత్తిపోయింది. భారీ ఛేదనలో సూర్యకుమార్ యాదవ్(60) ఒంటరి పోరాటం చేసినా జట్టును గెలిపించలేకపోయాడు. ఎలిమినేటర్‌లో సన్‌రైజర్స్‌ను రాజస్థాన్ ఢీకొట్టనుంది. చివరి లీగ్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ సమిష్టి కృషితో ప్లే ఆఫ్స్‌కు దూసుకెళ్లింది. గెలిస్తేనే ఎలిమినేటర్ బెర్తు దక్కనున్న వేళ జోఫ్రా ఆర్చర్(32, 3-17) చెలరేగాడు.వాంఖడేలో ముంబై ఇండియన్స్ బౌలర్లను బాదేసిన అర్చర్.. అనంతరం బంతితోనూ ఆ జట్టు బ్యాటర్లను వణికించాడు. బ్రిజేష్ శర్మ(2-26), బర్గర్(2-43) కీలక వికెట్లు తీసి సహకరించగా 8వ విజయం.. 16 పాయింట్లతో రాజస్థాన్ ప్లే ఆఫ్స్ బెర్తును ఖరారు చేసుకుంది. రాజస్థాన్‌కు భారీ స్కోర్ సమర్పించుకున్న ముంబై బ్యాటింగ్‌లో తడబడుతోంది. తొలి ఓవర్లోనే రోహిత్ శర్మ(0)ను డకౌట్ చేసిన ఆర్చర్(3-17) తర్వాతి ఓవర్లో నమన్ ధిర్(6)ను బౌల్డ్ చేసి రెండో వికెట్ అందించాడు. బర్గర్ ఓవర్లో రికెల్టన్(12)కవర్స్‌లో వైభవ్ చేతికి చిక్కగా. 24 వద్ద మూడో వికెట్ పడింది. అనంతరం సూర్యకుమార్ యాదవ్(60)తో కలిసి తిలక్ వర్మ(3) ఇన్నింగ్స్ నిర్మించాలనుకున్నాడు. కానీ, బ్రిజేష్ అతడిని బౌల్డ్ చేయడంతో పవర్ ప్లేలోనే నాలుగు వికెట్లు కోల్పోయింది ముంబై. విల్ జాక్స్(33) జతగా సూర్య ధనాధన్ ఆడగా ముంబై స్కోర్ వంద దాటింది. అయితే.. ఐదో వికెట్‌కు 63 రన్స్ జోడించిన జాక్స్‌ను యశ్ రాజ్ ఔట్ చేయగా వస్తూనే హార్దిక్ పాండ్యా(34) రెండు సిక్సర్లతో తన ఉద్దేశాన్ని చాటాడు. గెలిపించే బాధ్య తీసుకున్న ఈ ఇద్దరూ రాజస్థాన్‌ను భయపెట్టారు. రెండో స్పెల్‌లో ఆర్చర్ మరో వికెట్ అందిస్తూ పాండ్యాను వెనక్కి పంపాడు. కార్బిన్ బాష్(2) విఫలమవ్వగా.. శార్దూల్ ఠాకూర్(10 నాటౌట్) అండతో ముంబైని గట్టెక్కించాలనుకున్న సూర్యను బర్గర్ రిటర్న్ క్యాచ్‌తో పెవిలియన్ పంపడంతో రాజస్థాన్ విజయం ఖాయమైంది. చివరి ఓవర్లో 37 రన్స్ అవసరమవ్వగా శనక ఆరు పరుగులే ఇచ్చాడు. దాంతో.. 30 పరుగులతో గెలుపొందిన రాజస్థాన్ నాలుగో స్థానంతో మురిసింది.



## మెరిసిన రాహుల్, కుల్దీప్.. చివరి పంచ్ ఢిల్లీదే..!

చివరి లీగ్ మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్(ఐవశ్రీష్ట్రఱ ఖుజూఞఖుశ్రీం) అదరగొట్టింది. ఈడెన్ గార్డెన్స్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్‌ను చిత్తుగా ఓడించి విజయంతో టోర్నీని ముగించింది. రాహుల్(60) అర్ధ శతకంతో భారీ స్కోర్ కొట్టిన ఢిల్లీ.. కుల్దీప్ యాదవ్(3-29), ఎంగిడి(3-27) జోరుతో కోల్‌కతాను కట్టి చేసింది. రహానే(63) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడినా సహకరించేవాళ్లు కరువయ్యారు. పావెల్() రనౌటవ్వడంతో ఢిల్లీ 40 పరుగుల తేడాతో గెలుపొందింది. పంతొమ్మిదో సీజన్ లీగ్ దశ ముగిసింది. డబుల్ హెడర్ రెండో మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జయభేరి మోగించడంతో కోల్‌కతా నైట్ రైడర్స్ నిరాశగా ఇంటిదారి పట్టింది. డేంజరస్ ఓపెనర్ ఫిన్ అలెన్(20)ను బౌల్డ్ చేసిన ఎంగిడి(3-27) కోల్‌కతాకు షాకిచ్చాడు. కెప్టెన్ అజింక్యా రహానే(63)తో కలిసి దంచేసిన మనీశ్ పాండే(25)ను ఎంగిడి వెనక్కి పంపాడు.

## భారత అథ్లెటిక్స్ చరిత్రలో సరికొత్త సంచలనం.. జాతీయ రికార్డు బద్దలు..!



భారత అథ్లెటిక్స్ (×అసఆఖు౼ౌ్ప్రశ్రీవ్ఐఅఎం) లో సరికొత్త సంచలనం నమోదైంది. పరుగు పందెంలో మనకు ఒక ఉసేన్ బోల్ట్ దొరికేశాడంటూ క్రీడాభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. రాంచీ (=ఖుఅఎష్ట్రఱ) వేదికగా జరుగుతున్న 2026 అథ్లెటిక్స్ ఫెడరేషన్ కప్‌లో పంజాబ్ (ూబఅయిఖుఎ) కు చెందిన 25 ఏళ్ల గురిందర్‌వీర్ చిరుతలా పరుగెత్తాడు. పురుషుల 100 మీటర్ల ఫైనల్‌లో కేవలం 10.09 సెకన్లలోనే గమ్యాన్ని చేరి స్వర్ణ పతకాన్ని ముద్దాడాడు. సరికొత్త జాతీయ రికార్డును నెలకొల్పాడు. తన అద్భుత ప్రదర్శనతో గురిందర్‌వీర్ భారత అథ్లెటిక్స్ చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించాడు. 10.10 సెకన్ల కంటే తక్కువ సమయంలో 100 మీటర్ల దూరాన్ని పూర్తి చేసిన మొట్టమొదటి భారత అథ్లెట్‌గా నిలిచాడు. రిలయన్స్ ఫౌండేషన్ తరఫున బరిలోకి దిగిన గురిందర్‌వీర్, పాత జాతీయ రికార్డును బద్దలు కొట్టి ఈ చారిత్రక విజయాన్ని అందుకున్నాడు. అద్భుతమైన టైమింగ్‌తో గురిందర్‌వీర్ 2026 కామన్వెల్త్ గేమ్స్‌కు అర్హత కూడా సాధించాడు. కామన్వెల్త్ క్రీడల అర్హత మార్క్ 10.16 సెకన్లు కాగా.. దాన్ని వీర్ సునాయాసంగా అధిగమించాడు. ఇదే ఈవెంట్‌లో అనిమేష్ కుజుర్ (10.20 సెకన్లు) రజతం గెలుచుకోగా, ప్రణవ్ గురవ్ (10.29 సెకన్లు) కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. కాగా గురిందర్‌వీర్ విజయం భారత స్ప్రింటింగ్‌లో ఒక చారిత్రక మైలురాయిగా నిలిచిపోనుంది.



## మా ఆయన బంగారం..! ప్రేమ, పెళ్లి గురించి అవికా ఇంట్రెస్టింగ్ కామెంట్స్

నటి అవికా గోర్ రీసెంట్ గా అగ్లీ స్టోరీ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమా పాజిటివ్ టాక్ తో దూసుకుపోతుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ ఓ ఇంటర్వ్యూలో కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకుంది అవికా. తన ఏడేళ్ల ప్రేమ వివాహం, పెళ్లి తర్వాత తన జీవితంలో వచ్చిన మార్పుల గురించి తెలిపింది. పెళ్లి తర్వాత తమ దాంపత్య జీవితం చాలా సంతృప్తికరంగా ఉందని, ఒకరినొకరు గౌరవించుకుంటూ, ఒకరి ఎదుగుదలకు మరొకరు మద్దతు ఇస్తూ తమ సంబంధాన్ని నిర్వహిస్తున్నామని తెలిపింది. సామాజిక మాధ్యమాల ప్రభావం తమ సంబంధంపై ఉండదని, తాము వాటికి అతీతంగా ఆలోచిస్తామని అవికా తెలిపింది. తామిద్దరూ ఒకరికొకరు చాలా సపోర్ట్ గా ఉంటామని , తమ తల్లిదండ్రుల బంధాన్ని ఆదర్శంగా తీసుకుంటామని అవికా చెప్పుకొచ్చింది. తన భర్త కార్పొరేట్ రంగంలో సీనియర్ ప్రొడక్ట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారని, ఐఐఎం అహ్మదాబాద్ పూర్వ విద్యార్థి అని అవికా తెలిపింది.

## ఆ స్టార్ హీరో ఇచ్చిన సలహా ఇప్పటికీ పాటిస్తున్నా.. ఆసక్తికర విషయం చెప్పిన కాజల్

ఖటాలీవుడ్ అందాల చందమామ కాజల్ అగర్వాల్.. ప్రస్తుతం సినిమాల స్పీడ్ తగ్గించింది. పెళ్లి తర్వాత ఈ ముద్దుగుమ్మ ఆచితూచి సినిమాలు చేస్తుంది. భగవంత్ కేసరి సినిమా తర్వాత ఇప్పుడు ఈ అమ్మడు తెలుగులో మరో సినిమా చేయలేదు. కాగా గతంలో ఆమె ఓ ఇంటర్వ్యూలో తన కో స్టార్స్ గురించి, అల్లు అర్జున్, ప్రభాస్‌లతో తన జ్ఞాపకాలను ఒక ఇంటర్వ్యూలో పంచుకుంది. తాను తన సహనటులందరితోనూ మంచి పని సంబంధాలను కలిగి ఉన్నానని, సెట్‌లో అందరూ సహకారంతో ఉంటారని చెప్పుకొచ్చింది. సలహాలను ఎల్లప్పుడూ స్వాగతిస్తానని, కొన్నిసార్లు సహనటులు ఇచ్చిన సలహాలను తాను ఉపయోగించి అవి విజయవంతం అయినప్పుడు వారికి కృతజ్ఞతలు చెప్పడానికి వెనకాడనని కాజల్ పేర్కొన్నారు.ఖటాలీవుడ్ అందాల చందమామ కాజల్ అగర్వాల్.. ప్రస్తుతం సినిమాల స్పీడ్ తగ్గించింది. పెళ్లి తర్వాత ఈ ముద్దుగుమ్మ ఆచితూచి సినిమాలు చేస్తుంది. భగవంత్ కేసరి సినిమా తర్వాత ఇప్పుడు ఈ అమ్మడు తెలుగులో మరో సినిమా చేయలేదు. కాగా గతంలో ఆమె ఓ ఇంటర్వ్యూలో తన కో స్టార్స్ గురించి, అల్లు అర్జున్, ప్రభాస్‌లతో తన జ్ఞాపకాలను ఒక ఇంటర్వ్యూలో పంచుకుంది. తాను తన సహనటులందరితోనూ మంచి పని సంబంధాలను కలిగి ఉన్నానని, సెట్‌లో అందరూ సహకారంతో ఉంటారని చెప్పుకొచ్చింది.





## 'హల్లల్లల్లో'తో సోషల్ మీడియాలో పెద్ది మేనియా..

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'పెద్ది' ప్రమోషన్స్ ప్రస్తుతం దేశవ్యాప్తంగా భారీ హైప్‌ను సృష్టిస్తున్నాయి. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ట్రైలర్, తొలి రెండు పాటలు ప్రేక్షకుల్లో అంచనాలను పెంచగా.. ఇప్పుడు మూడో సాంగ్ 'హల్లల్లల్లో' వచ్చి సోషల్ మీడియాలో కొత్త ట్రెండ్‌కు శ్రీకారం చుట్టింది. గత రెండు రోజులుగా ప్రోమోతోనే వైరల్ అయిన ఈ పాట.. తాజాగా పూర్తి వీడియో విడుదల కావడంతో మెగా అభిమానుల్లో మరింత జోష్ నింపింది.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020